


జిల్లాలో ఎన్నికల వ్యయ పరిశీలకులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 17 : సాధారణ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన జ్యోతిమోయ్ బయ్ లంగ్, కంచన్ రామ్‌మీనాలు బుధవారం రాత్రి నెల్లూరు నగరానికి చేరుకున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులకు నుడా వీసీ బాపిరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటరమణ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కందుకూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా జ్యోతిమోయ్ బయ్ లంగ్, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలకు అబ్జర్వర్‌గా కంచన్ రామ్‌మీనా వ్యవహరించనున్నారు.





సీతారాముల కళ్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

జై శ్రీరామ్!!

- వైభవంగా నవమి
- ఊరూరా కల్యాణాలు
- మారుమోగిన రామనామం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 17 : శ్రీరామ నామం జిల్లా అంతటా మారుమోగింది. బుధవారం శ్రీరామ నవమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పల్లెలు, పట్టణాల్లో వాడవాడా సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. చలువ పందిళ్లు, పానకం, వడపప్పు, ప్రసాదాలు, విసనకర్రలు, పెండ్లి విందులతో నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జానకి రమణుల పరిణయోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రీరామ నామ జపం, భజనలు చేస్తూ తన్మయత్వం చెందారు. ఎన్నికల సీజన్ కావడంలో ప్రచారంలో భాగంగా పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి అనుచరులు సీతారామ కల్యాణోత్సవాలకు హాజరై పండితులు ఆశీస్సులు అందుకున్నారు. నెల్లూరు నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. పట్టు వస్త్రాలను తెలుగుగంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి దంపతులు, ముత్యాల తలంబ్రాలను 1వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జీ కపర్ది దంపతులు సమర్పించారు. ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	41.0	38.0	42.0	42.0	39.0
కనిష్ఠం	30.9	28.0	29.0	27.0	28.0


చిల్లరిస్తేనే చెక్కులు!

- ముఖ్యమంత్రి సహాయ నిధి సాయానికి చేయి తడపాల్సిందే
- అధికార పార్టీ నేతల కక్కుర్తి
- కావలి ఎమ్మెల్యే ఆఫీస్ కేంద్రంగా రోగుల సొమ్ములో వాటాలు



గాయపడిన ఓరుగంటి హిమబిందును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దంపతులు(ఫైల్)


కావలి రూరల్, ఏప్రిల్ 17 : "ఎక్కడా కూడా లంచాలు అనే మాట లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమ చేస్తున్నాం" అంటూ సీఎం జగన్ చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగే రోగులకు అందించే సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్/ముఖ్యమంత్రి సహాయనిధి) చిల్లర ఇస్తేనే చేతికందుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల్లూరు జిల్లా కావలి మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయాలంటే కొంతమంది వైసీపీ నాయకులు బాధితుల నుంచి నగదు వసూలు చేస్తున్నారనే విమర్శలు జోరుగా ఉన్నాయి. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి కార్యాలయంలో కొంతమంది నాయకులు ఈ తరహా దందాకు పాల్పడుతున్నట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావలి మండలం కొత్తపల్లిలో గత ఏడాది సెప్టెంబరు 20న వినాయక చవితి సందర్భంగా గణనాథుడి ప్రతిమ నిమజ్జన ఊరేగింపు జరిగింది. ఆ ఊరేగింపులో బాణసంచా పేలి పలువురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. దామా వర్షిత, ఒరుగంటి హిమబిందు తీవ్రంగా గాయపడగా, నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందారు. వర్షిత రూ.6 లక్షలతో చికిత్స పొందగా, చేతి సర్జరీకి మరో రూ.2 లక్షలు ఖర్చు అయిందని బాధితురాలి తండ్రి వాపోయారు. అలాగే హిమబిందు వైద్యానికి రూ. 2 లక్షలు ఖర్చు అయ్యింది. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దంపతులు వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో బాధితులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది జనవరిలో చెక్కులు వచ్చాయి. అయితే, ఈ విషయాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలో కొంతమంది మార్చి నెలాఖరు వరకు గోప్యంగా ఉంచారు. అంతేకాదు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇవ్వాలంటే 50 శాతం నగదు ఎమ్మెల్యే కార్యాలయానికి ఇవ్వాలని సదరు కార్యాలయంలో పనిచేసే యడవల్లి మహేశ్ డిమాండ్ చేసినట్లు బాధితులు వాపోయారు. గత్యంతరం లేక దామా వర్షిత తండ్రి చంద్ర కెనరా బ్యాంక్‌లో రూ.1.90 లక్షలు జమ చేసిన తర్వాత చెక్కు అందుకున్నారు. అలాగే ఓరుగంటి హిమబిందు తండ్రి మధు నుంచి ఎమ్మెల్యే కార్యాలయంలో పనిచేసే సాయిచరణ్ రూ.30 వేలు ఫోన్ పే ద్వారా తీసుకున్నారు. ఆ తరువాతే సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఇలా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి మంజూరు కాగా, ఆ నిధిలో కూడా ఎమ్మెల్యే అనుచరులు వాటాలు అడగడంపై బాధితులు లబోదిబోమంటున్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు కోసం హిమబిందు తండ్రి మధు నుంచి రూ.30 వేలు ఫోన్ పే చేయించుకున్న సాయిచరణ్

ఏం.. ఉన్నారో.. ఏం విన్నారో.. ఏం చూశారో...!?

ఐదేళ్లలో ఒక్క హామీ నెరవేర్చని జగన్
'ఒక్క చాన్స్' ఇచ్చినందుకు విసిగిపోయిన జనం
రేపటి నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు



'నేను ఉన్నాను.. నేను విన్నాను.. నేను చూశాను..!' సీఎం కుర్చీ ఎక్కడమే ధ్యేయంగా రాష్ట్రమంతా పాదయాత్ర చేసిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాలో కూడా తన మాటను బలంగా వినిపించారు. ఆ మాటలు నమ్మిన జనం 2019 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. అయితే, ఐదేళ్లు గడిచినా జగన్‌రెడ్డి చెప్పిన మాటలు నెరవేరలేదు. ఏం ఉన్నారో.. ఏం చూశారో.. ఏం విన్నారో...నంటూ నిట్టూర్పులు విడుస్తున్నారు. పాదయాత్ర సందర్భంగా జగన్ నడిచిన దారులు బాగుపడలేదు. పల్లె, పట్టణం ఇలా ప్రతిచోట స్థానికులకు జగన్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. పాపం జగన్ అంటూ ఒక్క చాన్స్ ఇచ్చిన ప్రజలకు గత ఐదేళ్లుగా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ఆయన చుక్కలు చూపిస్తున్న వైనంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు శుక్రవారం నుంచి వెలువడనున్నాయి.

పాదయాత్రలో మాటలివి..

కోవూరు చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామన్నారు. అది జరగకపోగా ఫ్యాక్టరీని తుక్కు కింద విక్రయించడానికి సిద్ధమయ్యారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్న సోమశిల జలాశయాన్ని విస్మరించారు. చివరికి దెబ్బతిన్న అప్రాన్ మరమ్మతులకు కూడా డబ్బులు ఇవ్వలేదు. ఉత్తర కాలువ ఆధునీకరిస్తానన్నారు. హైలెవల్ కెనాల్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నెలలు, సంవత్సరాలు గడిచినా ఆ ఊసే లేదు. పరిశ్రమలు తీసుకొచ్చి, ఉద్యోగాలు కల్పిస్తామని ఆత్మకూరు యువతకు ఇచ్చిన మాట నెరవే రకపోగా వచ్చిన ఒక్క పరిశ్రమను కూడా బద్వేలుకు తరలించుకుపోయారు. కలిగిరి జిర్రావారిపాలెం కాటన్ యార్డును కోల్డ్ స్టోరేజ్‌గా, రాళ్లపాడు ప్రాజెక్టు రూపురేఖలు మారుస్తామన్నారు. సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరిస్తామన్నారు. కానీ, ఇవేవీ ఆచరణ సాధ్యం కాలేదు.

సీఎంగా ఇచ్చిన హామీలూ గాలికి..

ప్రతిపక్ష నాయకుడిగా ఇచ్చిన హామీలు అటుంచితే ముఖ్యమంత్రిగా చేసిన హామీలు సైతం అటకెక్కించేశారు. కావలి పర్యటనలో ఆ పట్టణ అభివృద్ధికి 80 కోట్ల రూపాయలు ప్రకటించారు. పైసా విదల్చలేదు. 2021లో నెల్లూరును వరద ముంచెత్తినప్పుడు మందీమార్బలంతా వచ్చిన జగన్ అన్నీ చూశారు. మునక ప్రాంత ప్రజల బాధలు విన్నారు. వరద పోటు నివారణకు పెన్నా పొర్లు కట్టల నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదిక రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు పెన్నా నది ఒడ్డు మీద నుంచి బలంగా ప్రకటించారు. కానీ, ఏం చేద్దాం.. రెండేళ్లు అవుతున్నా పొర్లుకట్టల నిర్మాణాలు పూర్తికాలేదు. పొట్టేపాళెం వంతెన వద్ద ప్రజల అవస్థలు చూశారు. వంతెన నిర్మిస్తామని మాటిచ్చారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జలదీక్షకు పూనుకుంటే దానిని విఫలం చేయడానికి కలుజు నుంచి నీరు రాకుండా తాత్కాలికంగా మట్టి వేయించారే తప్ప వంతెన నిర్మాణానికి పూనుకోలే. జొన్నవాడ సమీపంలోని దేవరపాళెం కలుజు కొట్టుకుపోవడాన్ని చూశారు. యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు. పాపం యుద్ధ ప్రాతిపదికన అంటే అర్థం ఎప్పటికి పూర్తి కాదనే విషయాన్ని ఇప్పటికి అర్థం చేసుకున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)





కోవూరులోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

తొలిఘట్టం నేటి నుంచే!

- 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఏర్పాట్లు

నెల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఘట్టం రానే వచ్చింది. పార్లమెంటు, అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా నాల్గవ దశలో మన రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. నెల్లూరు పార్లమెంటుతో పాటు జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆయా రిటర్నింగ్ అధికారులు (ఆర్వో) నోటిఫికేషన్లను విడుదల చేస్తారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను దాఖలు చేయవచ్చు. మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఒక్క నిముషం ఆలస్యమైనా నామినేషన్‌ను స్వీకరించరు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ సెలవు రోజుల్లో నామినేషన్ల దాఖలుకు వీలుండదు. 26న స్క్రూటినీ, 29న మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆ తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ఆర్వోలు ప్రకటిస్తారు. రిజిస్టర్ పార్టీల అభ్యర్థులకు ఆయా పార్టీల గుర్తులనే కేటాయిస్తారు. స్వతంత్ర అభ్యర్థులకు మాత్రం ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తులను కేటాయిస్తారు.

నామినేషన్ల స్వీకరణ ఇక్కడే!

నెల్లూరు నగర నియోజకవర్గానికి కార్పొరేషన్ కార్యాలయంలో, నెల్లూరు రూరల్‌కు నెల్లూరు ఆర్డీవో కార్యాల యం, సర్వేపల్లికి వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయం, కోవూరుకు కోవూరు తహసీల్దార్ కార్యాలయం, ఆత్మకూరుకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం, ఉదయగిరికి ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం, కందుకూరుకు కందు కూరు సబ్ కలెక్టర్ కార్యా లయం, కావలికి కావలి ఆర్డీవో కార్యాల యంలో నామినే షన్లు స్వీకరిస్తారు. అలానే నెల్లూరు పార్లమెంటు స్థానా నికి సంబంధించి నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ వేసే వ్యక్తితోపాటు నలుగురికి మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతి ఉంటుంది. పార్లమెంటు స్థానానికి నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.25 వేలు, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు వేసే అభ్యర్థులు రూ.10 వేలను నామినేషన్‌తోపాటు సెక్యూరిటీ డిపాజిట్ కింద అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇందులో సగం మినహాయింపు ఉంటుంది. ఇక నామినేషన్ల సమయంలో ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకే ర్యాలీలు, వాహనాలకు అనుమతి ఉంటుంది.

నిబంధలు పాటించాలి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు నూతన నామినేషన్ పత్రాలను అందచేశామని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. నామినేషన్లలో ఎటువంటి ఖాళీలు ఉండకూడదని, ఫామ్-ఏ, ఫామ్-బీ పత్రాలను ఇంకుతో మాత్రమే సంతకం చేసి అందించాలని సూచించారు. అలాగే తాజా అఫిడవిట్, నామినేషన్ పత్రాలను మాత్రమే వినియోగించాలని కోరారు.

తీర ప్రాంత ప్రజల అభిమానం మర్చిపోలేనిది

- నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



పెదపట్టపుపాలెం రాములవారి గుడిలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేమిరెడ్డి, ఇంటూరి

ఉలవపాడు, ఏప్రిల్ 17 : గ్రామీణ ప్రాంత ప్రజలతో కలిసి దైవ కార్యక్రమాలు, పూజలు నిర్వహించడం, తీర ప్రాంత ప్రజల ఆదరణ, అభిమానం మరచిపోలేనిదని గెలిచాక అందరికీ సేవచేసి రుణం తీర్చుకుంటానని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెదపట్టపుపాలెం, పల్లెపాలెం, రెడ్డిపాలెం, చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీల్లో బుధవారం జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చింది ప్రజాసేవ చేయడానికే తప్ప మరొకటి ఆశించికాదని, పదేళ్లుగా 150 గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటిని అందించానని అన్నారు. మరో అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తీరప్రాతం గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలను రాబోవు టీడీపీ ప్రభుత్వంలో పక్కా తీరుస్తానని ఆయా గ్రామస్థులకు మాట ఇచ్చారు. చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీలో శ్రీరాములవారి గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని వేమిరెడ్డి కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార గ్రామల కాపులు, పెద్దలు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

- పోలీస్ అధికారుల సమీక్షలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఐజీ

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 17 : ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ అనుగుణంగా పారదర్శకత, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో ఐజీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు, భద్రత పరమైన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రచారం కోసం జిల్లాకు వచ్చే వీవీఐపీలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఈ మేరకు ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. నామినేషన్లకు ఎంసీసీ నిబంధనలు అనుసరించి తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, నోడల్ అధికారి అప్రమత్తంగా పర్యవేక్షించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలలో ఇతర శాఖలు, గ్రామపెద్దల సమన్వయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల ఎలక్టోరల్ అఫెండర్లు, శారీరిక, భౌతిక దాడి చేసిన వారు, నేర చరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేయాలని, బైండోవర్ ఉల్లంఘించి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం జిల్లాలో ఇప్పటివరకు డిపాజిట్ చేసుకున్న ఆయుధాల వివరాలు, ఎగ్జిక్యూట్ చేసిన వారెంట్లు, బైండోవర్లు, నేర చరిత్ర కలిగిన వారి వివరాలు, సమస్యాత్మక ప్రాంతాలలో కేంద్ర బలగాలతో జరిపిన ఫ్లాగ్ మార్చ్ గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు సీహెచ్ సౌజన్య, ఏవీఆర్‌పీబీ ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఉదయగిరి

ఎన్డీఏ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపే లక్ష్యం

వింజమూరు: పట్టణంలోని వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో బుధవారం ఎమ్మార్పీఎస్ నియోజక వర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలేష్ మాదిగ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే కాకర్ల గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా అధ్యక్షులు అంబేద్కర్‌మాదిగ, నాయకులు వెంకటేశ్వర్లు, సుజాత, బాలగురవయ్య, మోహన్‌రావు, వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

జగదానంద కారకా.. జయ జానకి ప్రాణ నాయకా!

- భక్తి శ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు
- సీతారాముల కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు

ఆత్మకూరు, ఏప్రిల్ 17: నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపారు. పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి, పంటవీధి, కన్యకాపరమేశ్వరి ఆలయంలోని కోదండరామస్వామి ఆలయాల్లో, కాశినాయన ఆశ్రమంలో, అరుంధతీపాళెంలో మహోత్సవాలను భక్తులు నిర్వహించారు. నిర్వాహకులు సీతారాముల కల్యాణం నిర్వహించగా మహిళలు అధికసంఖ్యలో విచ్చేసి మహోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం, ఎల్ఆర్‌పల్లి, అశోకనగర్, పిడుగు రంగయ్యవీధిలోని ఆలయాలు విద్యుత్ దీపాలతో శోభిల్లాయి.

సంగం: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో వధువరులుగా అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, మంత్రోశ్చరణల నడుమ కల్యాణం నిర్వహించారు. జంగాలదొరువు, కొరిమెర్ల, ఉడ్‌హౌస్‌పేట, తరుణవాయి, వంగల్లు, జండాదిబ్బ, అనుసూయనగర్, పల్లిపాళెంలోని రామాలయాల్లో వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొన్నిచోట్ల మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



సంగం: కల్యాణం జరిపిస్తున్నపండితులు

వైభవంగా గరుడవాహన సేవ

సిద్దీపురం సీతారామస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గరుడవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తిని గరుడ వాహనంపై ఉంచి గజమాలలతో అలంకరించారు. వీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం ఊరేగించారు. ఉత్సవానికి భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సీతారామపురం: స్థానిక పరమటివీధి రామాలయంలో రుత్వికుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్థానిక గ్రామ దేవత అంకాలమ్మ తల్లికి పానకం, వడపప్పు బండికట్టి ఊరేగింపుగా అంకాలమ్మ తల్లి గుడి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పానకం, వడపప్పు దారి పొడవునా పంచుకుంటూ వెళ్లారు. యువకులు ఆనందంగా రంగులు చల్లుకుంటూ ఉట్టి కొట్టారు.

ఉదయగిరి: గడ్డంవారిపల్లి, చౌడేపల్లి, అప్పసముద్రం, గండిపాళెం, కుర్రపల్లి, పుల్లాయపల్లి, బిజ్జంపల్లిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరి సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నందిపాడు, రెడ్లదిన్నె, వెంకటంపేట, నర్రవాడ, కొత్తపేట, రాచవారిపల్లి, బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు గ్రామాలతో పాటు దుత్తలూరులోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. దుత్తలూరు కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వహించారు.



ఉదయగిరి : కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సీతారామపురం : ఎడ్లబండిలో స్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వెళ్తున్న భక్తులు

హోరెత్తిస్తున్న ప్రచారం

ఉదయగిరి, ఏప్రిల్ 17: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం నేటితో ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసి ప్రచారపర్వంలోకి దిగాయి. ఊరూ..వాడా అనే తేడా లేకుండా ప్రచారం ఊపందుకొంది. పార్టీల జెండాలు రెపరెపలాడుతున్నాయి. మైకుల మోతలతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రచారం హోరెత్తిస్తున్నారు నాయకులు. ఆయా పార్టీల అభ్యర్థులు ఆకర్షణీయమైన ప్రచార రథాలను తయారు చేయించు కున్నారు. డిజిటల్ ఫ్లెక్సీలను రథాలకు అమరుస్తున్నారు. వివిధ రకాల వాహనాలతోపాటు డీసీఎంలను ప్రచార రథాలుగా మారుస్తున్నారు. ఒక పార్టీ ప్రచార రథం వెనుక కొంద దూరంలో మరో పార్టీ ప్రచారం చేస్తుండడంతో మైకుల మోతలను ప్రజలు భరించలేకపోతున్నారు.

నేటి నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ

- కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

ఉదయగిరి, ఏప్రిల్ 17: గురువారం నుంచి నామినేషన్ల ప్రారంభం కానుండటంతో ఆ ప్రక్రియకు సర్వం సిద్ధం చేసినట్లు బుధవారం నియోజకవర్గ ఎన్నికల రిట ర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఈ నెల 25వరకు ఉంటుంద న్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 26న పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. సెలవుదినాల్లో నామినేషన్ల ప్రక్రియ జరగదన్నారు. అసెంబ్లీకి పోటీ చేసే ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. కేంద్రానికి వంద మీటర్ల దూరంలో కోడ్ అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థుల నామినేషన్ సమర్పించే సమయంలో సందేహాలను నివృతి చేసేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: రాష్ట్రంలో రాక్షస పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం కొండాయపాళెం పంచాయతీలోని గానుగపెంటపల్లి, మాసాయిపేట గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి గడపగడపకు వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడికత్తి, గులకరాయి డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్‌ను శాశ్వితంగా ఇంటికి పంపేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఉదయగిరి అసెంబ్లీ, నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థులు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే 2019లో జరిగిన అభివృద్ధి, సంక్షేమం యథావిధిగా కొనసాగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బయ్యన్న, పరిశీలకులు గంగాధర్, సర్పంచ్ వరలక్ష్మీ, టీడీపీ, జనసేన నాయకులు ఓబులరెడ్డి, శ్రీరాములు, గూడూరు వెంకటేశ్వరరావు, శ్రీరాములు, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, మాబాషా, ఖాన్‌సా, శివకృష్ణ ఉన్నారు.



మాసాయిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఐక్యంగా కలుద్దాం.. గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం !

ఆత్మకూరు, ఏప్రిల్ 17: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సమన్వయంతో ముందుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22న టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్డీఏ కూటమి అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, కరటంపాటి సుధాకర్, వాశిపల్లి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి

అనంతసాగరం: ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం గెలుపుకు అందరూ సహకరించాలని మండల టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. మంగళవారం ఆమె ఎగువపల్లి, గుడిగుంట, యాకర్లపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరు రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహరాజు, సంగరాజు దశరథ రాజు, విజయ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: స్థానిక దిలావర్‌భాయ్‌వీధిలో బుధవారం డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసులు అడవుల్లో జరిగే అగ్నిప్రమాదాలపై కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఉదయగిరి రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

మామ గెలుపు కోసం కోడలి ప్రచారం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోడలు నిహారిక రెడ్డి బుధవారం పట్టణంలోని సినిమాహాలువీధి, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కర పత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిం చారు. ఆమె వెంట జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల కన్వీ నర్ ఓబులరెడ్డి, మూలె వినయ్‌రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి, ముర్తుజా, ఉప్పుటూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుటుంబ పెద్దగా ఆలోచన చేసేది చంద్రబాబు

- ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్



వింజమూరు: టీడీపీలో చేరిన నాయకులతో కాకర్ల



జలదంకి: కుటుంబ సభ్యురాలిని ఓదార్చుతున్న కాకర్ల సురేష్

వరికుంటపాడు, ఏప్రిల్ 17: అన్నివర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు కుటుంబ పెద్దగా ఆలోచించి పథకాలకు రూపకల్పన చేస్తారని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. బుధవారం జడదేవి, తూర్పుచెన్నంపల్లి, అలివేలుమంగాపురం, తూర్పుబోయమడగల, గువ్వాడి, కాంచెరువు, ఇస్కపల్లి, నల్లబోతులవారిపల్లి, జీ.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. టీడీపీ శ్రీకారం చుట్టిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తొలి సంవత్సరంలోనే ఈ ప్రాంత సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీఇచ్చారు. ప్రధానంగా తాగు,సాగునీరు, ఉపాధి, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రస్తుత పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందలేదని దుయ్యబట్టారు. అలాగే నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందుకే ఆరోగ్య సమస్యలను ముందస్తుగా తెలుసుకునేందుకు రెండేళ్లుగా తాను ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా వైద్యసేవలు అందించానన్నారు. ఈ ఎన్నికల్లో తనతో పాటు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపిస్తే టూరిజంగా అభివృద్ధి చేయడంతో పాటు పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తామన్నారు. పింఛన్ల పంపిణీపై వలంటీర్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు భయపడా ల్సిన అవసరం లేదన్నారు. మన ప్రభుత్వంలో జూలై నెల పింఛన్ రూ. 7వేలతో పాటు ప్రతినెల రూ.4వేలు అందజేస్తామన్నారు. వెనుకబడిన ఉదయగిరి ప్రాంతంలో ప్రజల బాధలను గుర్తించిన తాను నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. ఉదయగిరిపై ప్రత్యేక దృష్టి చేపడతామని చంద్రబాబుతో సహ లోకేష్ సైతం హామీ ఇచ్చారని, వారి సూచనలతో ఆదర్శంగా తీర్చిదిద్దుతా మన్నారు.

దాహం తీర్చండయ్యా...

తూర్పుచెన్నంపల్లిలో కాకర్ల రచ్చబండపై కూర్చొని సమస్యలపై ప్రస్తావించారు. గ్రామంలో వాటర్ ప్లాంటు మొరాయించడంతో దాహం తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోయారు. స్పందించిన ఆయన టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ప్లాంటుపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. తాను గెలిచిన వెంటనే ప్లాంటుతో పాటు రహదారికి మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, తాజా, మాజీ జెడ్పీటీసీలు రావిళ్ల నాగేంద్ర, బోగినేని శ్రీనివాసులు, గుర్రం గోపి, పోకా మహేశ్వరరావు, కామేపల్లి వెంకటరత్నం, ముజ్జె లక్ష్మినారాయణ, నాగినేని వెంకటేశ్వర్లు, నాదెళ్ల నారయ్య, మాగంటి మహేష్, పావులూరి నారాయణ, ఏనుగంటి నరేంద్ర, బక్కా ఆంతోని, ఉప్పాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాకర్ల ప్రచారం

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి పంచాయతీలో గురువారం సాయంత్రం నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు యూనిట్ ఇన్‌చార్జ్ నాదెళ్ల రాజేంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తొలిసారి విచ్చేస్తున్న ఆయనకు అన్ని గ్రామాల్లో ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దావులూరి కుటుంబాన్ని ఆదుకుంటాం..

జలదంకి: చామదలకు చెందిన దావులూరి శ్రీనివాసులు కుటుంబానికి చెందిన ఐదుగురు మంగళవారం ముంగమూరుతోటల జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ బుధవారం చామదలకు వచ్చి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు సోదరుడు శ్రీరాములు రోదన చూసి చలించిన కాకర్ల కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిదండ్రుల మృతదేహాల వద్ద రోదిస్తున్న ఇంజనీరింగ్ చదువుతున్న మృతుడు శ్రీనివాసులు కుమార్తెను అక్కున చేర్చుకుని ఓదార్చారు. జరిగిన సంఘటనపై స్థానికుడైన తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డిని మృతుల కుటుంబ వివరాలు, పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ టీడీపీ కుటుంబసభ్యులను రోడ్డుప్రమాదంలో కోల్పోవడం బాధగా ఉందన్నారు. శ్రీనివాసులు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో సురేష్‌తో పాటు మండల టీడీపీ నాయకులు మధురెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, క్రిష్ణారెడ్డి, తిరుమల పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక వైసీపీ కో ఆప్షన్, ఎంపీటీసీ రఫీతో పాటు మరో 20 కుటుంబాలు బుధవారం ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో పార్టీలోకి చేరారు. వీరికి కాకర్ల కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీలో మొదటి నుంచి వున్న నాయకులు కూడా తెలుగుదేశం వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కన్వీనర్ రఘునాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రచ్చబండపై సమస్యలు తెలుసుకుంటున్న కాకర్ల సురేష్



విలేకరులతో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

పేద, పెత్తందారు ఎవరో 13న తెలుస్తుంది!

- హత్యలు, దాడులు, కబ్జాల్లో మొనగాడు జగన్
- ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలపై దాడుల్లో ఆల్‌టైమ్ రికార్డు
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 17 : పేద ఎవరో.. పెత్తందారు ఎవరో...? వచ్చేనెల 13న ప్రజలే తేలుస్తారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సీఎం జగన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో హత్యలు, దాడులు, కబ్జాలు, అరాచకాలు చేయడంతో జగన్ మొనగాడని దుయ్యబట్టారు. దోపిడీకి చిరునామాగా వైసీపీ ప్రభుత్వం మారిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మీద జరిగిన దాడుల్లో ప్రభుత్వం ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పిందని విమర్శించారు. పైగా పలు పథకాలు రద్దు చేసిన ఘనుడు జగనేనన్నారు. వైసీపీ విజయానికి ఎంతో కృషిచేసిన వైఎస్ వివేకానందరెడ్డిని ఎవరు చంపారో జగన్ చెల్లెళ్లు వీధికెక్కి చెబుతుంటే, విచారణ చేయించలేని అసమర్థుడు ఈ ముఖ్యమంత్రి అని ఆరోపించారు. ఆయన హత్యను కూడా గత ఎన్నికలలో వాడుకున్నారన్నారని విమర్శించారు. ఆస్తులు, అధికారం, అధిపత్యం కోసం విచక్షణ రహితంగా వైఎస్ వివేకాను హత్యచేసి ఆ నేరం చంద్రబాబు మీద వేయలేదా ? అని ప్రశ్నించారు. తిరుమల పింక్ డైమండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రాగానే కేసును వెనక్కు తీసుకున్న నేత జగనేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, తిరుమల నాయుడు, మాతంగి కృష్ణ, పనబాక భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 లక్షల నగదు స్వాధీనం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: మండలంలోని యర్రబల్లిగడ్డ వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.5 లక్షల నగదును బుధవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఇత్తడి నారాయణ, తన సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. సీతారామపురం మండలం బాలాయపల్లికి చెందిన ముత్తంశెట్టి కేశవరావు, వెంకటేశ్వర్లు కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని శకునాలపల్లికి వెళుతన్నారు. వాహన తనిఖీల్లో భాగంగా యర్రబల్లిగడ్డవద్ద వారి వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1.50 లక్షల నగదు దొరికింది. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగదును ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డికి అప్పగించారు. తదుపరి చర్యల్లో భాగంగా నగదును ట్రెజరీలో జమ చేస్తామని వారు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్ఐ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

అంగన్‌వాడీ ఆయాపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: అంగన్‌వాడీ ఆయా జీ.భారతిపై మండల నోడల్ అధికారి దేవరకొండ ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం రాత్రి తెలిపారు. ఉదయగిరిలోని ఇందిరానగర్, ఎస్సీ కాలనీల్లో సోమవారం జరిగిన వైసీపీ ప్రచారంలో భారతి పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె విచారణ జరిపి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు

- కన్నీటి పర్యంతమైన చామదల వాసులు

జలదంకి, ఏప్రిల్ 17: కావలి ముంగమూరుతోటల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఐదుగురికి బుధవారం స్వగ్రామమైన మండలంలోని చామదలలో అంత్యక్రియలు జరిగాయి. మృతులను కడసారి చూసేందుకు చామదల గ్రామస్థులతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చారు. దీంతో చామదల ఎస్సీకాలనీ జన సందోహంతో నిండిపోయింది. దావులూరి శ్రీనివాసులు కుటుంబానికి చెందిన ఐదుగురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మంచి వ్యక్తికి ఇలా జరగడమేమిటంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడు శ్రీనివాసులు కూతురు, సోదరుడు శ్రీరాములు రోదనలు మిన్నంటాయి. భారీ జన సందోహం మధ్య అంత్యక్రియలు జరిగాయి.

కొరవడిన 'నిఘా'!

- నిరుపయోగంగా సీసీ కెమెరాలు

కలిగిరి, ఏప్రిల్ 17: కావలి, ఉదయగిరి, కందుకూరు, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లడానికి ప్రధాన కూడలి ప్రాంతమైన కలిగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిరుపయోగంగా మారాయి. సుమారు ఐదేళ్ల క్రితం పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని కలిగిరమ్మ కూడలి, తహసీల్దారు కార్యాలయం కూడలి ప్రాంతాల్లో నిఘానేత్రాలు (సీసీటీవీ కెమెరాలు) ఏర్పాటు చేశారు. కలిగిరిమ్మ కూడలి ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఉదయగిరి, కందుకూరు ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలు, తహసీల్దారు కార్యాలయ కూడలి ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కావలి, నెల్లూరు మార్గాలలో వెళ్లే వాహనాలు కనిపించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతాల్లో నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగుల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈవ్‌టీజింగ్, గొడవలు తదితరాలు జరిగినపుడు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించేందుకు కంట్రోల్ వ్యవస్థ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. అయితే సీసీ కెమెరాల వ్యవస్థను పోలీసు శాఖ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం నిఘా కొరవడింది. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు, వాహన తనిఖీలు, తనిఖీ సిబ్బంది పర్యవేక్షణలు తదితర సమాచారాలను తెలుసుకోవడానికి ముందస్తు చర్యల్లో భాగంగా నిఘానేత్రాలను వాడుకలోకి తీసుకొస్తే ప్రజలకు రక్షణ అందించడంతోపాటు అధికారులకు వేగవంతంగా సమాచారం అందుకోవడానికి వీలు కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.



తహసీల్దారు కార్యాలయ కూడలి



కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పిచ్చి కుక్క దాడిలో బాలుడికి గాయాలు

ఉలవపాడు : పిచ్చి కుక్క దాడిలో 4 ఏళ్ల బాలుడికి గాయాలయ్యాయి. మండలంలోని వీరేపల్లి పంచాయతీ పరిధిలోని తూర్పు ఎస్టీ సంఘంలో మంగళవారం రాత్రి సంతోష్‌కుమార్ తన ఇంటి వద్ద ఉండగావీధి కుక్క ఒకటి ఉన్నపలంగా పిల్లాడి కాలు నోటకరచి లాక్కొని వెళ్లే ప్రయత్నం చేసింది. గమనించిన యువకులు కాపాడారు. కుక్కల బెడద ఎక్కువైయిందని పంచాయతీ అధికారులు పట్టించుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	144
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 7010
వెండి కిలో ధర	రూ. 87,100
వెండి ఒక గ్రాము	రూ. 89.10

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం!

● ప్రజలకు తప్పని ఇబ్బందులు



దుకాణాల ఎదుట అధ్వానంగా రహదారి



ప్రభుత్వ కార్యాలయాల ఎదుట తొలగించని రాళ్లు

కలిగిరి, ఏప్రిల్ 17: కావలి-దుత్తలూరు రహదారి విస్తరణలో భాగంగా కలిగిరి తహసీల్దారు కార్యాలయ కూడలి నుంచి హెచ్‌పీ పెట్రో ల్ బంకు వరకు రోడ్డుకు ఇరువైపులా ఇల్లు, దుకాణాలు, ప్రహరీలను తొలగించారు. ఈ క్రమంలో తొలగించిన ప్రాంతాల్లో నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దారు కార్యాలయం నాలుగు రహదారుల కూడలి ప్రాంతం కావడం, సమీపంలో బస్‌షెల్టర్, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం వలన నిత్యం విద్యార్థులు, ప్రయాణికులు, ఉద్యోగులు ఎక్కువగా సంచరిస్తుంటారు. రోడ్డు నిర్మాణపు ప నులు మొదలు పెట్టకపోవడం వలన స్థానికులు ఇళ్లలో నుంచి బయటకు వచ్చి తమ పనులు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలను పగులకొట్టిన తరువాత వాటిని తొలగించి ఆ ప్రాంతం శుభ్రం చేయకపోవడతో కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజానీకం అసౌకార్యానికి గురవుతున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ కాలువ, రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా వెంటనే పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మాలేపాటికి టీడీపీ శ్రేణుల సత్కారం



మాలేపాటిని సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

కావలి, ఏప్రిల్ 17: టీడీపీ కావలి మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడిని రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీ నియమించిన సందర్భంగా బుధవారం పట్టణంలోని మాలేపాటి నివాసంలో పలువురు టీడీపీ శ్రేణులు ఆయనను కలిసి అభినందనలు తెలిపి శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ వెన్నంటే నడుస్తున్న తనను పార్టీ గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చి ప్రోత్సహిస్తున్నందుకు పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. తనను గుర్తించి రాష్ట్రస్థాయి పదవి ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకి, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి, జాతీయప్రధానకార్యదర్శులు నారా లోకేష్, బీద రవిచంద్రలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర, బొట్లగుంట శ్రీహరినాయుడు, యేగూరి చంద్రశేఖర్, మంచాల ప్రసాద్, కాండ్ర భాస్కర్, చల్లా వెంకటేశ్వర్లు, వెంకట్రావు, పీ. రవీంద్ర పాల్గొన్నారు

పైడి కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట : బోగోలు మండలం కడనూతలలో బుధవారం జరిగిన తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి పైడి హర్ష సతీమణి పైడి ప్రియాంక ప్రథమ వర్ధతిలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి, మాలేపాటి నాగేశ్వరావు, పోట్లూరి శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు ఉన్నారు.

దళితులను వేధించిన వారికి టికెట్లు!

● 18 నెలలు కాదు 18 ఏళ్లు శిక్ష విధించాలి

● దళిత సంఘర్షణ సమితి నేతల ధర్నా

అల్లూరు, ఏప్రిల్ 17 : దళితులను వేధించినా, హత్య చేసిన వారికి వైసీపీలో ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు ఇచ్చేస్తారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. దళితుల శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులుకు 18 నెలల జైలు శిక్ష విధిస్తూ వెలువడిన తీర్పుపై ఆయన దళితులతో కలసి అల్లూరు పాతబస్టాండు కూడలి వద్ద బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో దళితులను అన్యాయంగా శిరోముండనం చేసిన కేసులో తోట త్రిమూర్తులుకు ఐదేళ్ల జైలు శిక్షకు బదులు 18 నెలలు మాత్రమే జైలు శిక్ష వేయడం దారుణమైన పరిణామమన్నారు. అటువంటి వారికి 18 ఏళ్లు శిక్ష విధించినా తక్కువేనన్నారు. పేదలకు ఒక చట్టం సంపన్నుడికి మరో చట్టంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం నడుస్తుందన్నారు. దళితులపై హత్య, హత్యాయత్నం, హింసలు చేసి వారికి వైసీపీలో టిక్కెట్టు ఇచ్చి దళితులకు అన్యాయం చేసి అక్రమార్కులకు ప్రత్యేక గౌరవాన్ని జగన్మోహన్‌రెడ్డి కల్పిస్తున్నాడని మండిపడ్డాడు. ఇటువంటి చర్యలు ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి తగదన్నారు. దళితులపై ఉక్కుపాదం మోపిన తోట త్రిమూర్తులుకు వైసీపీ టికెట్టు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగు ప్రసాద్, సాదేపల్లి దాసు, కాకాణి వెంకయ్య, దర్శిగుంట వెంకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు పాతబస్టాండు కూడలిలో ధర్నా చేస్తున్న దళిత నేతలు

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

కందుకూరు, ఏప్రిల్ 17: పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి గుర్రం శ్రీనివాసులు, వెంకట రమణమ్మ దంపతులు బుధవారం రూ.30వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహం, నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం

కందుకూరు, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా బుధవారం రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. కందుకూరు పట్టణం, వాడవాడలా రామాలయాలు శ్రీరామనామస్మరణతో మార్మోగాయి. ప్రజలు ఇంటింటా పూజలు నిర్వహించిన అనంతరం కుటుంబ సమేతంగా రామాలయాల్లో తరలివెళ్లారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి వడపప్పు, పానకం పంచిపెట్టారు. పట్టణంలోని పెద్దబజారులోని కోదండరామాలయం, పామూరు రోడ్డులోని రామాలయం, అమలనాథునిపాలెం, నందావారి వీధి, ఏకలవ్య నగర్ ప్రాంతాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరిగాయి. అమలనాథునిపాలెం, మండలంలోని మోపాడులో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాలలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య తదితరులున్నారు.



కావలిటౌన్ : సత్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం

కావలిటౌన్ : పట్టణంలోని దక్షిణంపేట కోదండరాముడి ఆలయం, ఉత్తరంపేట పట్టాభిరాముడి ఆలయం, పుల్లారెడ్డి నగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, వెంగళరావునగర్, జనతాపేట, రామయ్యబడి, ముసునూరులలోని రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సత్యనారాయణస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు కనులపండువగా జరిగాయి. యేల్చూరి వెంకటేశ్వర్లు కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దక్షిణంపేట కోదండరామాలయంలో చొప్పఉత్సవం, తిరుమంజనం ప్రత్యేక పూజలు జరిగాయి.

కావలి రూరల్ : మండలంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. రామాలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేశారు. ఆలయాల చలువపందిళ్లు వేసి దేవతామూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వడపప్పు, బెల్లం పానకాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

కలిగి : మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. రామాలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోశ్చరణాల మధ్య, చలువపందిళ్ల కింద జరిగిన సీతారామ కల్యాణ వేడుకలను భక్తులు కనులారా తిలకించారు.

అల్లూరు : అల్లూరు, నార్తుమోపూరుల్లోని రామమందిరాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరుపేటలోని సీతా లక్ష్మణ హనుమత్సమేత కోదండరామస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది దంపతులకు రాత్రి నిర్వహించిన కల్యాణం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తీరప్రాంత గ్రామాల్లో ప్రతి చోటా శ్రీరామనవమి కార్యక్రమాలు అంబరాన్నంటాయి.

జలదంకి : మడంలంలోని అన్ని రామాలయాల్లో శాస్త్రోక్తంగా నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాలను భక్తులు తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో మిరమిట్లుగొలిపాయి. రామనామస్మరణతో మారమోగాయి. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బిట్రగుంట : బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేటలోని ట్రాఫిక్ రామాలయంలో రైల్వే పీడబ్ల్యూ అధికారి కృష్ణన్ ఆధ్వర్యంలో వేదపండితులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకాల పంపిణీ అనంతరం ఆలయ కమిటీ సభ్యులచే అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. చెంచులక్ష్మీపురంలోని కోదండరామాలయంలో పీఎస్సార్ ట్రస్ట్ నిర్వహకులు పసుపులేటి సుధాకర్, సుగుణ దంపతులు కల్యాణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. రామస్వామిపాలెం రామాలయం, బోగోలు విజయ గణపతి, యాదవపాలెం కోదండరామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వడపప్పు, పానకం పంచిపెట్టారు.



బిట్రగుంట : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



జలదంకి : వేదికపై కొలువుదీరిన సీతారాములు

లింగసముద్రం : లింగసముద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండలంలో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన ఓరుగంటి శివమురళీకృష్ణ, సుస్మితలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కమనీయంగా జరిగిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు పరవశంతో పులకరించిపోయారు. అనంతరం గ్రామానికి చెందిన దేవకి బసవారావు భక్తులకు అన్నదానం చేశారు. ఈ పండుగ సందర్భంగా లింగసముద్రంలోని బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, వీఆర్ కోట, మొగిలిచెర్ల, పెంట్రాల, చినపవని, పెదపవని తదితర గ్రామాలలోని రాములవారి ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వలేటివారిపాలెం : మండలంలోని శింగమనేనిపల్లె రామాలయంలో బుధవారం జరిగిన శ్రీరామనవమి వేడుకలకు కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వడపప్పు, పానకం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు అత్తోటి విజయసారథి, సర్పంచు వెంకటేశ్వర్లు, నాయకులు గరికపాటి రామానాయుడు, తానికొండ బాపయ్య, కాపులూరి వెంకటేశ్వర్లు, బాసం వెంకటేశ్వర్లు, బత్తిన మాల్యాద్రి, అంజయ్య మాధవి, తానికొండ అశోక్, గుర్రం లక్ష్మీనరసింహం, కంచర్ల మాల్యాద్రి, గొడపేరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం : శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

కావలి రూరల్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని అగ్నిమాపక అధికారి రామసిద్ధార్థ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ లక్ష్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్, సైన్స్ కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్‌వో రామసిద్ధార్థ మాట్లాడుతూ గ్యాస్, కరెంటు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎదైనా ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గ్యాస్ లీకేజీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

టీడీపీలో చేరిన చీమలపెంట ఎస్సీ కాలనీ వాసులు



బడేవారిపాలెంలో ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన చీమలపెంట ఎస్సీ కాలనీవాసులు

లింగసముద్రం, ఏప్రిల్ 17 : మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంట ఆదిఆంధ్ర కాలనీ యువకులు బుధవారం వలేటివారిపాలెం మండలం బడేవారిపాలెంలోని ఇంటూరి నాగేశ్వరరావు స్వగృహంలో ఆయన సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన యువకులు బందెల శ్రీను, వందనం, అజయ్, గోచిపాతల సింగయ్య, సిద్ధారపు పుల్లయ్య, కోటేశ్వరరావు, రూబేను, లక్ష్మయ్య, లాబాను, బంకా దీనమ్మ తదితరుకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని రమణయ్య, నాయకులు ముత్తులూరి సుధాకర్, గంగినేని మధు, కరణం హజరత్తయ్య, చెన్నారెడ్డి దత్తాత్రేయ, కరణం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 17 : మండలంలోని పోకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఏక పాత్రాభినయం నాటిక పోటీలలో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి తెనాలికి చెందిన రాము, రెండవ బహుమతి కలిగిరికి చెందిన పురుషోత్తం, మూడవ బహుమతి అనంతపురంకు చెందిన ఆనంద్‌రెడ్డి, ప్రోత్సాహక బహమతి బడేవారిపాలెంనకు చెందిన గాంధీకి లభించింది

టీడీపీ పాలనలోనే రాయితీ రుణాలు, సంక్షేమ పథకాలు : బీద రవిచంద్ర



పార్టీలో చేరిన వారితో బీద రవిచంద్ర, కావ్య క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 17: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాయితీ రుణాలు, సంక్షేమ పథకాలను అందచేశామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. బోగోలు వైసీపీ సీనియర్ నాయకులు బోగిరి యోహాను, ఆయన తనయుడు బోగిరి ప్రభాకర్, వారి అనుచరులు సుమారు 100 మంది బుధవారం రాత్రి టీడీపీలో చేరారు. వారంతా కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కావ్య, బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రాభివద్ధే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. కావలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగాయంటే టీడీపీ పాలనలో మాత్రమే అన్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి చెందాలన్న, రైతులు, సామాన్యులు ఆర్థికంగా ఎదగాలన్నా టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎం.నాగేశ్వరావు, కే.మధుబాబునాయుడు, డీ.వేణుగోపాల్‌రెడ్డి, పీ.రవికుమార్‌చౌదరి, ఎం.వెంకయ్య, డీ.అంజయ్యయాదవ్, కే.రఘురాంనాయుడు, ఎస్.దావీదు, శివ వరప్రసాద్ రెడ్డి, విజయ్‌కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

● పడమర పల్లెలో ప్రచారం

బోగోలు మండలంలోని పడమర పల్లెలో టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కమ్మవారిపాలెంకు చెందిన వైసీపీ నాయకుడు బట్టిపాటి ప్రభాకర్ చౌదరి, కొమ్మి ఆనంద్, వారి అనుచరులు టీడీపీలో చేరారు. వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సోమేశ్వరపురంలో శివయ్యకు పూజలు జరిపించి, గ్రామంలో ప్రచారం సాగించారు. అనంతరం జక్కేపల్లిగూడూరు, బీజీవీ కండ్రిక, ఎస్‌జీవీ కండ్రికల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు పమిడి రవికుమార్ చౌదరి,కే.వెంకటేశ్వర్లురెడ్డి, గద్దెకొండయ్య, వై.వెంకటేశర్లురెడ్డి, పుట్ట సుబ్బారావు, ఎంకపునాయుడు, సుధీర్‌బాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మాన్ని ఎవరైనా పాటించవచ్చు..!



బుద్ధుడి చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న బౌద్ధ సేవకులు

బిట్రగుంట, ఏప్రిల్ 17: బౌద్ధ ధర్మాన్ని స్త్రీ పురుషులెవరైనా పాటించవచ్చని సాదవి (బికుని) ఉపేక అయ్యాజీ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన వైద్యుడు కొర్రా చంద్రశేఖర్, శిరీష దంపతులు ఆహ్వానం మేరకు ఆమె బుధవారం బోగోలుకు చేరుకున్నారు. మాస్టర్ సుబ్బారావుతో పాటు పలువురు బౌద్ధ ధర్మ అనుచరులతో కలసి ర్యాలీ నిర్వహించారు. బోగోలు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరించిన అనంతరం వెంకటేశ్వర పాలి క్లీనిక్ వద్ద ఏర్పాటు చేసి బౌద్ధ మత చిహ్నం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతు బుద్ధుడు భారతదేశంలో జన్మించినప్పటికి ఆయన బోధనలను అనుసరించే వారు కొందరే అన్నారు. బుద్ధుడి పంచశీల సూత్రలను ఎవరైనా పాటించవచ్చన్నారు. పరస్పర గౌరవం, సార్వభౌమ అధికారం, సమానత్వం, శాంతియుత, సహజీవనం వంటి వాటిలో సత్య న్యాయ ధర్మాలను పాటించాలని కోరారు. సాదవి ఉపేక అయ్యాజీ నుంచి బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలకు చెందిన పలువురు బౌద్ధమతం స్వీకరించారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాధ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు




గౌతమీ నదిలో పుణ్య స్నానాలు





20న జిల్లాలో చంద్రబాబు ప్రచారం



నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని గూడూరు, సర్వేపల్లి నియోజక వర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారు. 20వ తేదీ ఉదయం 11 గంటలకు గూడూరులో మహిళలతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు సర్వేపల్లిలో బహిరంగ సభలో జరిగే ప్రజాగళం సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు.

సమరానికి సై

నామినేషన్ ప్రక్రియ ప్రారంభ కానుండడంతో ఎన్నికల సమరానికి తెరలేచింది. తమ బలాలను, బలగాలను పార్టీలు మోహరిస్తున్నాయి. ఇప్పటికే తొలివిడత ఎన్నికల ప్రచారాన్ని ముగించుకున్న ప్రధాన పార్టీలు గురువారం నుంచి ప్రచారాలను మరింత ముమ్మరం చేయనున్నాయి. వ్యూహాలు, ప్రతివ్యూహాలతో క్షణం తీరికలేకుండా గడపనున్నారు. గత ఎన్నికలతో పోల్చితే జిల్లాలో దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో హేమాహేమీలు తలపడుతున్నారు. తమ తలరాతలు తేల్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

బరిలో హేమాహేమీలు • ఊపందుకోనున్న వ్యూహాలు.. ప్రతివ్యూహాలు • ధర పెరగనున్న ఓటు • రూ.వేలల్లో పలికే సూచనలు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాల్లో ప్రధాన పార్టీల నుంచి సమ ఉజ్జీలు కదనరంగంలోకి దిగారు. నెల్లూరు పార్లమెంట్ నుంచి టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేస్తున్నా వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. ప్రచారంలో కొత్త ఒరవడిని, ఊపును తీసుకొస్తున్నారు. వైసీపీ కూడా వ్యూహాత్మకంగా పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని రంగంలోకి దింపింది. ఆయన కూడా పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే వీపీఆర్ ప్రభావంతో వైసీపీ నుంచి వలసవెళుతున్న వారిని నిలువరించడానికే ఆయన ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఏది ఏమైనా విజయ సాయి అభ్యర్థిత్వంతో వైసీపీ నుంచి వలసలు కొంతవరకు తగ్గాయనే చెప్పాలి.

• సిటీలో ప్రచారం ఏకపక్షం


ఇక నెల్లూరు సిటీలో ప్రచారం, పోటీ ఏకపక్షంగానే కనిపిస్తోంది. మంత్రి హోదాలో నెల్లూరుకి అభివృద్ధిని పరిచ యం చేసిన పొంగూరు నారాయణ ఈ సారి మళ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తు న్నారు. ఆయన నియోజకవర్గం పరిధి లోని లక్ష కుటుంబాలను నేరుగా కలిసి టీడీపీని గెలిపించమని అభ్యర్థించారు. నారాయణతోపాటు ఆయన సతీమణి రమాదేవి సైతం ప్రచారంలో ఉన్నారు. ఈ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా డిప్యూటీ మేయర్ ఖలీల్అహ్మద్ పోటీ చేస్తున్నారు. ఇక్కడ పోటీ కాని, ప్రచారం కాని ఏకపక్షంగానే కనిపిస్తున్నాయి.

• రూరల్ బరిలో దిగ్గజాలు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ దిగ్గజాల మధ్య రసవత్తర పోటీ నెలకొంది. టీడీపీ అభ్యర్థిగా తాజా మాజీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఆయనకు మాస్ లీడర్‌గా గుర్తింపు ఉంది. నిత్యం ప్రజల్లో ఉండటంతోపాటు ప్రజాసమస్యలపై నిరంతర ఉద్యమాలు చేస్తున్నారు. ప్రత్యర్థిగా పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డికి రాజకీయంగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. సిట్టింగ్ ఎంపీ, తాజా మాజీ ఎమ్మెల్యే మధ్య రూరల్‌లో రసవత్తర పోటీ వాతావరణం కనిపిస్తోంది.

• హాట్‌టాపిక్‌గా కోవూరు

జిల్లాలో హాట్‌టాపిక్‌గా కోవూరు ఉంది. ప్రముఖ రాజకీ య కుటుంబానికి చెందిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఆమెకు ఎన్నికల వాతావరణానికి పూర్తిగా కొత్త అయినా ప్రచారంలో కాని, ప్రసంగాల్లో కాని ఏ మాత్రం తగ్గకుండా విజృంభిస్తున్నారు. వీపీఆర్ దంపతుల పోటీతో కోవూరు వాడీ, వేడిగా, హడావిడిగా కనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు.



• కనకపట్నంలో నువ్వా..నేనా ?

కావలి నుంచి పాత, కొత్త నాయకులు నువ్వా, నేనా అంటూ తలపడుతున్నారు. టీడీపీ అభ్యర్థిగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తొలిసారిగా పోటీ చేస్తున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర వ్యూహకర్తగా, మాలేపాటి సుబ్బానాయుడు సర్వ సైన్యాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. ఆయనకు అండగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఎన్నికల వ్యూహ రచన చేస్తుండగా, సుకుమార్ రెడ్డి సైన్యాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

• ఉద్దండులు పోటీ

రాజకీయాల్లో ఉద్దండ కుటుంబాలు ఆత్మకూరులో కలబడుతున్నాయి. ఆనం కుటుంబ పెద్ద రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మంత్రి హోదాలో ఆత్మకూరులో ఆయన చేసిన అభివృద్ధి ఈ రోజుకు ఆయనకు అండగా నిలుస్తోంది. నియోజకవర్గంలోకి ఆలస్యంగా అడుగుపెట్టినా, వైరి వర్గాలు బిత్తరపోయేలా పాత కాపులను కలుపుకొంటూ దూసుకుపోతున్నారు. మేకపాటి కుటుంబం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇక్కడ రెండు కుటుంబాల మధ్య రసవత్తర పోటీ నడుస్తోంది.

• దుర్గంలో ఇద్దరూ కొత్తవారే..

ఉదయగిరిలో రెండు ప్రధాన పార్టీల నుంచి కొత్తవారు పోటీ పడుతున్నారు. కాకర్ల సురేష్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. కొత్తగా నియోజకవర్గంలోకి అడుగుపెట్టినా ఊహకందని రీతిలో ప్రజలను తనవైపునకు ఆకర్షించుకుంటు న్నారు. నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఆయనకు అండగా నిలిచి ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటివరకు తెరవెనుక పాత్ర పోషించిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఈసారి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. రాజకీయ కురువృద్ధుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉదయగిరి, ఆత్మకూరులో వైసీపీ తరఫున ఎన్నికల సారథ్యం వహిస్తున్నారు.

• కొత్త వ్యూహ్యాలు..

నిన్నటి వరకు ప్రచారాల వరకే పరిమితమైన పార్టీలు గురువారం నుంచి ప్రచారంతోపాటు ప్రలోభాలకు తెరలేపే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికలకు భిన్నంగా అధికార పార్టీ నుంచి ఈసారి భారీగా వలసలు జరుగుతున్నాయి. అగ్రస్థాయి నాయకుల నుంచి గ్రామ స్థాయి నాయకుల వరకు పెద్ద సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలస వస్తున్నారు. వీటిని నిలువరించే క్రమంలో ఇక కొనుగోళ్ల మొదలు కానున్నాయి. జిల్లాలో అన్ని విధాలాబలమైన అభ్యర్థులు పోటీ పడుతున్న నేపథ్యంలో ఈసారి ఓటు విలువ కూడా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు ఇప్పటికే ప్రలోభాలకు తెరలేపారు. గ్రామ, వార్డు స్థాయి నాయకులకు ధర నిర్ణయించి, వారిని తమ పార్టీలోనే కొనసాగేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. నాయకుల అసమ్మతిని కరెన్సీ కట్టలతో చల్లబరిచారు. చాలా నియోజకవర్గాల్లో నాయకుల స్థాయిని బట్టి ఇప్పటికే తొలి విడతగా పంపకాలు జరిగినట్లు సమాచారం. వలంటీర్లను, మెప్మా సిబ్బందిని అడ్డంగా పెట్టుకుని ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు ప్రారంభించారు.

• కొత్త, పాతల యుద్ధం


కందుకూరులో కొత్త, పాతల మధ్య యుద్ధం మొదలయ్యింది. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. వైసీపీ ఈ స్థానానికి పక్క నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రాను దిగుమతి చేసుకుంది. ఇక్కడ ఇప్పుడిప్పుడే వేడి రాజుకొంటోంది.

• సర్వేపల్లిలో పాతకాపులే..

సర్వేపల్లి బరిలో ఉన్నది ఇద్దరు పాతకాపులే అయినా ఈ సారి యుద్ధం మాత్రం కొత్తగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యర్థి అవినీతిని ప్రధాన అంశంగా జనంలోకి తీసుకెళుతున్నారు. వైసీపీ అభ్యర్థి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని, జగన్ మోహన్‌రెడ్డి పథకాలను నమ్ముకొని జనంలోకి వెళుతున్నారు.

ఓటేద్దాం..

• ఫ్లెక్సీలతో అవగాహన



ఉదయగిరి తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మే13న సార్వత్రిక ఎన్ని కలు జరగను న్నాయి. దేశ, రాష్ట్ర భవిష్యత్తు నిర్దేశించే ఎన్ని కలు కావడంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరిచేలా అధికారులు పలు కార్యక్రమా లు చేపట్టారు. ఇందులో భాగంగా ఓటింగ్‌లో పాల్గొం దాం.. తప్పనిసరిగా ఓటువేద్దాం.. అంటూ ఉదయగిరి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్



మాయదారి ఎన్నికలు మళ్లొచ్చే!

ఎట్టెట్టా

రమణమ్మ : వదినా.. మాయదారి ఎన్నికలు మళ్లొచ్చా.. ఇంకేముంది మనూళ్లో జాతరే జాతర. మీ ఆయన, మాఇంటోడు ఇక మనకి దొరకరే !

సుభద్ర : బాగచెప్పావ్.. రమణమ్మ ! మొన్ననే మీ అన్న ఉదయమెప్పుడో.. బయటపోయి రాత్రెప్పుడో వచ్చిండు. ఏమైపోయావయ్యా అంటే ఎన్నికలమే అన్నాడు.

రమణమ్మ : వదినో మీ తమ్ముడు ఇప్పట్నుంచే జనాల్ని పోగేసుకుంటు న్నాడు.వాళ్లకి ఈయనే ఖర్చంతా పెడత న్నాడంటా. ఈయనకెందుకు అంత జిల.

సుభద్ర : ఓమే రమణమ్మ ఇలాంటియ్యి ఇంకెన్ని చూడల్లో...మనం. ఐదోనెల్లోనంట ఎలచ్చన్లు. అప్పటిదాకా ఈళ్లిద్దరితో యాగొద్దా ?

రమణమ్మ : ఏమోపో వదినా... మా ఇంటోడు ఎన్ని గొడవలు తెస్తాడో.. భయంగా ఉంది. ఈ మనిషికి ఎన్ని చెప్పినా రాజకీయం పిచ్చిపోదు...

సుభద్ర : ఇద్దరికి గట్టిగ చెప్పి చూద్దాం. వినకపోతే ఆ దేవుడు మీదే భారమేద్దాం..సరేనా !

- నెల్లూరు రూరల్

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- కలెక్టరేట్‌లో ఎంపీ అభ్యర్థులు..
- కార్పొరేషన్ కార్యాలయంలో నగర అభ్యర్థులు..
- ఆర్డీవో కార్యాలయంలో నెల్లూరు రూరల్ అభ్యర్థులు నామపత్రాల దాఖలు
- ప్రతి సెంటరు వద్ద డీఎస్పీతోపాటు 92 మంది సిబ్బంది విధి నిర్వహణ



ఈతరం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికలకు తొలి ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. పోటీలో నిలిచే అభ్యర్థులు నేటి నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలోనూ, నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఆర్డీవో కార్యాలయంలోనూ, నెల్లూరు పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థులు కలెక్టరేట్‌లోనూ నామినేషన్లు వేయనున్నారు. కాగా ఆయా కేంద్రాల వద్ద బందోబస్తు వివరాలను నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.


నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డితో పాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 30మంది ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, రెండు స్పెషల్ పార్టీలు బందోబస్తులో ఉంటాయి. ఆర్డీవో కార్యాలయం కేంద్రం వద్ద సీసీఎస్ డీఎస్పీ రామకృష్ణాచారితోపాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, రెండు స్పెషల్ పార్టీలు ఉంటాయి. కలెక్టరేట్ వద్ద ఏఎస్పీ సీహెచ్ సౌజన్యతో పాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, రెండు స్పెషల్ పార్టీలు బందోబస్తు నిర్వహించనున్నాయి. ఆయా కేంద్రాల గేట్ల వద్ద నుంచి 100 మీటర్ల దూరం ముందే ఊరేగింపుగా వచ్చిన వారిని పోలీసులు నిలిపి వేస్తారు. అనుమతులు తీసుకున్న నాలుగు వాహనాలను మాత్రం కేంద్రం గేటు వరకు అనుమతి స్తారు. గేటు వద్ద వాహనాలను నిలిపి అభ్యర్థులు కాలి నడకన నామినేషన్ కేంద్రంలోకి వెళ్లి నామి నేషన్ వేస్తారు. అభ్యర్థులు ఎప్పుడు నామినేషన్లు వేస్తున్నారో ముందుగా తెలియజేయాల్సి ఉంటుంది. ఊరేగింపులకు ముందుగా పోలీసుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

ఎన్నికల్లో పోటీ చేస్తున్నారా..?

ఓటుసంగ్రామం

- నియమ నిబంధనలు ఇవిగో...
- మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో జిల్లాలోని ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షిం చుకునేందుకు సిద్ధమవుతున్నారు. తమకు అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లను కేటాయించాలని పార్టీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరి కొందరైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు రంగం సిద్ధపడుతు న్నారు. అయితే వీరంతా కూడా ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హులవుతారు. పోటీ చేసే వారి అర్హత, నామి నేషన్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పూర్తిగా తెలుసు కోవాలని అధి కారులు చెబుతున్నారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రి య ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అభ్యర్థులు నియమ, నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది.



• నిబంధనలు ఇలా..

ఎంపీ లేదా ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు భారతదేశ పౌరులై ఉండాలి. 25 ఏళ్ల వయసు కలిగి దేశంలో, రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా ఓటర్ల జాబితాలో పేరు కలిగి ఉండాలి. రాష్ట్రంలో ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయ వచ్చు. స్థానికేతరులు పోటీచేసే సమయంలో మాత్రం ప్రతిపా దించేవారు ఆ నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి. అలాగే స్థానికేతర నియోజకవర్గాల్లో పోటీ చేసేటప్పుడు ఓటు ఏ నియో జకవర్గంలో ఉందో అక్కడి రిటర్నింగ్ అధికారి నుంచి అటెస్టెడ్ సర్టిఫికెట్ తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆదాయం పొందే పదవిలోనూ, ఉద్యోగి అయి ఉండకూడదు. ఒకవేళ ఉద్యోగి పోటీ చేయాలనుకుంటే ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి ఉంది.

నామినేషన్ సమయంలో జాగ్రత్తలివే..

● అభ్యర్థులు నామినేషన్ దాఖలకు ముందు విధిగా బ్యాంకు ఖాతా పాసుపుస్తకాన్ని, పాన్‌కార్డు వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ● ఓసీ, బీసీ అభ్యర్థులు అసెంబ్లీకి పోటీ చేసేందుకు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలి. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థులు రూ.25వేలు డిపాజిట్ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం ఇందులో సగం చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు విధిగా కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ● గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులు సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. ఇతరులను మాత్రం విధిగా 10 మంది ఓటర్లు ప్రతిపాదించాలి. ● గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసేటప్పుడు నామినేషన్ సమయం ముగిసేలోపు ఆయా రాజకీయ పార్టీల ఏ, బీ ఫారమ్‌లను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. అప్పుడే పార్టీ గుర్తు లభిస్తుంది. ఏ, బీ ఫారమ్స్ ఇవ్వలేకుంటే ప్రతిపాదించిన ఓటర్ల సంఖ్య 10 కంటే తక్కువ ఉంటే ఆ నామినేషన్ పరిశీలన తిరస్కరణకు గురవుతుంది. ప్రతిపాదించిన ఓటర్లు పదిమంది ఉంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా గుర్తిస్తారు. ● అసెంబ్లీ లేదా పార్లమెంట్‌కు పోటీ చేసే సమయంలో నామినేషన్ దాఖలు సమయంలో నోటరీ చేయించిన అఫిడవిట్ సమర్పించాలి. ఇందులో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు సమగ్రంగా ఉండాలి. ● అఫిడవిట్‌లోని అన్ని కాలమ్స్‌ను విధిగా పూర్తిచేయాలి. ఏ ఒక్క కాలమ్ ఖాళీగా ఉంచినా రిటర్నింగ్ అధికారి నోటీసు ఇస్తారు. అప్పటికీ స్పందించి పూర్తిచేస్తే సరి లేదంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.

- జిల్లాలో 19.36 లక్షల మంది హక్కుదారులు
- పురుషుల కంటే మహిళలే అధికం

తాజా ఓటర్ల జాబితా విడుదల



నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 17 : జిల్లాలో తాజా ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 19.36 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురు షులు 9,47,344 మంది, స్త్రీలు 9,88,579 మంది ఉన్నారు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళా ఓటర్లే 41,235 మంది ఎక్కువగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	112917	115373	26	228316
కావలి	116689	120969	28	237686
ఆత్మకూరు	105466	109152	8	214626
కోవూరు	128580	137856	25	266461
నెల్లూరు సిటీ	116111	122046	67	238224
నెల్లూరు రూరల్	135602	143111	20	278733
సర్వేపలి	112528	118889	26	231443
ఉదయగిరి	119451	121183	10	240644

ఉద్ధండుల బరి ఆత్మకూరు

ముఖచిత్రం



ఆత్మకూరు నియోజకవర్గ చిత్రపటం

ఆత్మకూరు ఏప్రిల్ 17: జిల్లాలో ఆత్మకూరు నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ఓటర్లు విభిన్న తీర్పు ఇస్తున్నారు. వెన్నుపోట్లుకు, వర్గాధిపత్యాలకు ఆలవాలమై కొందరికి రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చి, మరికొందరిని రాజకీయాల నుంచి సాగనంపుతోంది. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి భీకరపోరుకు అస్త్రాలు సిద్ధం చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి తన పట్టు నిలుపుకునే ప్రయత్నంలో ఉన్నారు. జిల్లాలో ప్రముఖ రాజకీయ కుటుంబాలకు చెందిన ఈ ఇద్దరు ఈ ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకోబోతున్నారు.

ఎక్కువసార్లు గెలిచింది కాంగ్రెస్సే...

ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఏకంగా 9 సార్లు విజయం సాధించింది. వైసీపీ మూడు సార్లు, టీడీపీ రెండు సార్లు, స్వతంత్ర అభ్యర్థులు మూడు దఫాలు విజ యం సాధించారు. కాగా 2022లో జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి అత్యధిక మెజార్టీ సాధించారు. 1958లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం సంజీవరెడ్డి స్వల్ప మెజార్టీతో గెలుపొందారు.

● 1952లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో జీసీ కొండయ్య స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గంగవరపు తిరుపతినాయుడిపై గెలుపొందారు. 1957లో జీసీ కొండయ్యపై గెలుపొందిన బెజవాడ గోపాలరెడ్డి సీఎంగా కూడా పనిచేశారు. బెజవాడ గోపాలరెడ్డి లోక్‌సభకు వెళ్లడంతో 1958లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆనం సంజీవరెడ్డి విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో పెళ్లకూరు రామచంద్రారెడ్డి ఆనం సంజీవరెడ్డితో ఢీకొని పరాజయం పొందారు. తిరిగి 1967లో రామచంద్రారెడ్డి విజయం సాధించారు. 1972లో కంచర్ల శ్రీహరినాయుడు,1978లో డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి 1983లో టీడీపీ తరఫున ఆనం వెంకటరెడ్డి విజయం సాధించారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా సుందరరామిరెడ్డి బీజేపీ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుపై 831 ఓట్ల తేడాతో గెలుపొంది రాష్ట్రరాజకీయాల్లో సంచలనం సృష్టించారు. 1989లో సుందరరామిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కొమ్మి లక్ష్మయ్య నాయుడు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా బొల్లినేని క్రిష్ణయ్య విజయం సాధించారు. 2004లో ఇండిపెండెంట్‌గా అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యనాయుడు, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి గౌతమ్ రెడ్డిని ప్రజలు గెలిపించారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి మరణం తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన సోదరుడు మేకపాటి విక్రమరెడ్డి అత్యధిక మెజార్టీ సాధించారు.

కొత్తదనానికి చోటు

● మే 13న జరగనున్న ఎన్నికల్లో తిరిగి వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డితో తలపడుతున్నారు. ఆది నుంచి కొత్తదనానికి ప్రాధాన్యత ఇస్తూ, కొన్ని సమయాల్లో వర్గ రాజకీయానిదే పైచేయిగా ఉంటున్న ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ దఫా అర్థ, అంగబలం కలిగిన సమ ఉజ్జీలు రంగంలోకి దిగారు. మొత్తం మీద నియోజక వర్గం లో వర్గ రాజకీ యాలు, వెన్ను పోట్లను తట్టు కొన్నవారు సులభంగా విజ యం సాధిస్తు న్నారు. ఉద్ధండులకు ఊపిరి పోసిన ఆత్మకూరు ఈసారి ఎవరికి పడుతుందో బ్రహ్మారథం పడుతుందో చూడాలి.

సంవత్సరం	విజేతలు	పార్టీ	ఆధిక్యం
2022	మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఉపఎన్నిక)	వైసీపీ	82884
2019	మేకపాటి మేకపాటి గౌతమ్‌రెడ్డి	వైసీపీ	22276
2014	మేకపాటి గౌతమ్‌రెడ్డి	వైసీపీ	31,412
2009	ఆనం రామనారాయణరెడ్డి	కాంగ్రెస్	18,644
2004	కొమ్మి లక్ష్మయ్యనాయుడు	స్వతంత్ర	4,397
1999	బొల్లినేని కృష్ణయ్య	కాంగ్రెస్	2,069
1994	కొమ్మి లక్ష్మయ్యనాయుడు	టీడీపీ	17,965
1989	డాక్టర్ బి.సుందరరామిరెడ్డి	కాంగ్రెస్	334
1985	డాక్టర్ బి.సుందరరామిరెడ్డి	కాంగ్రెస్	830
1983	ఆనం వెంకటరెడ్డి	టీడీపీ	14,249
1978	డాక్టర్ బి.సుందరరామిరెడ్డి	కాంగ్రెస్	3,238
1972	కంచర్ల శ్రీహరినాయుడు	కాంగ్రెస్	5,340
1967	పెళ్లకూరు రామచంద్రారెడ్డి	స్వతంత్ర	5,224
1962	ఆనం సంజీవరెడ్డి	కాంగ్రెస్	8,647
1958	ఆనం సంజీవరెడ్డి (ఉపఎన్నిక)	కాంగ్రెస్	45
1955	బెజవాడ గోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	14,097
1952	జీసీ కొండయ్య	స్వతంత్ర	10122

అమ్మ బాబోయ్... ఏం ఎండలు ?



ప్రచారంలో ఎండ దెబ్బకు తాళలేక చెట్టుకింద సేదతీరుతున్న టీడీపీ నాయకులు

• చెట్ల కింద సేదతీరుతూ ప్రచారం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: సాధారణ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకుల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అదే క్రమంలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమం టున్నాడు. ఆరేడు ఇళ్లు తిరిగి, ఎండదెబ్బకు తాళలేక నాయ కులు, కార్యకర్తలు చెట్ల కింద సేదతీరుతు న్నారు. శీతలపానీ యాలు, చల్లనినీటితో గొంతు తడుపుకుంటున్నారు. బుధవారం ఉదయగిరి మండలం మాసాయిపేట బీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు ఎండధాటికి తట్టుకోలేక ఇలా చెట్టు కింద సేదతీరారు.

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు



పంచేడులో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం



పొదలకూరు: వడపప్పు, పానకం పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 17: బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వా మి ఆలయం, కల్యాణ వేంకటేశ్వరస్వామి, సాయి బాబా, వేణుగోపాలస్వామి ఆలయాలతోపాటు మండలంలోని జొన్నవాడ శ్రీ వరదరాజస్వామి ఆలయం, పెనుబల్లి, కాళయకాగొల్లు, శ్రీరంగరాజపురం, మినగల్లు, పంచేడు, రెడ్డిపాళెం పురంధరపురం, రేబాల, దామరమడుగు తదితర గ్రామాలలోని వైష్ణవాలయాలలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచే డులో జడ్పీటీసీ సభ్యురాలు సూరా ప్రదీప, శ్రీనివాసులురెడి దంపతులు ఉభయకర్తలుగా సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల బుధవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.



శ్రీరాముడి వేషధారణలో చిన్నారి రియాన్విక శ్రీసాయి

శేషవాహనంపై ఊరేగిన కోదండరాముడు

బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని శ్రీకోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి సీతా,లక్ష్మణ సమేతంగా స్వామివారు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ఆలయ పండితులు, అర్చకులు ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం తిర్చి ఉత్సవం జరిగింది. పలువురు దాతలు భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

మనుబోలు: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాలు, మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. మనుబోలులోని పడమరవీధిలోని శ్రీ కోదండరామాలయంలో సీతారాముల ఉత్సవమూర్తులకు వెండి కిరీటాలు, వెండిశఠారిని ఆలయ ధర్మకర్త ఉచ్చూరు లక్ష్మీనరసారెడ్డి, తనూజమ్మ కుటుంబ సభ్యులు వితరణ జేశారు. పూజా కార్యక్రమాలకు ఉభయదాతలుగా కాండ్ర లక్ష్మీనరసారెడ్డి, శాంతి దంపతులు వ్యవహరించారు. తూర్పు వీధి మందిరంలో ముత్యాల కల్యాణసాయి, సరిత దంపతులు, దేవాంగవీధి మందిరంలో కన్నా మురళీకృష్ణ దంపతులు ఉభయదాతలుగా వ్యవహ రించారు.

పొదలకూరు: పట్టణంలోని రామమందిరం వీధిలోని ఆలయంలో, మండలంలోని పలు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రాచపూటి ధనుంజయరావు, చింతగింజల సుబ్రహ్మణ్యం, డాక్టర్ జొన్నలగడ్డ, బ్రహ్మయ్య, కాశీనాయన, తదితరులు పాల్గొన్నారు.

● **సాయిబాబా మందిరంలో..**

పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని వైభ వంగా నిర్వహిం చారు. ఉభయకర్తలుగా దేవినేని నాగేశ్వరరావు, నందకుమారి దంపతులు వ్యవహ రించారు.

కొడవలూరు: మండలంలోని నార్తు రాజు పాళెంలో సీతారాముల ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహోత్సవం అనంతరం దోరడ్ల సత్యనారాయణ, లలితమ్మలు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . ఉభయ కర్తలుగా దోరడ్ల శశిధర్, సుప్రజ, డి ఉదయ్ కిరణ్, కాంచన లక్ష్మిలు వ్యవహరించారు. అనంతరం గ్రామంలో సీతారాముల ఊరేగింపు మహోత్సవం జరిగింది.

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరులో శ్రీరామ మందిరంలో సీతారాముల కల్యాణం మండల ఉపాధ్యక్షురాలు కైలాసం లావణ్య, శ్రీనివాసులురెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.సురేందర్‌రెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సైదాపురం: మండలకేంద్రంతో పాటు ఊటుకూరు, మొలకలపూండ్ల, కలిచేడు, తుమ్మలతలుపూరు, పెరుమాళ్లపాడు, పాలూరుచాగణం, మర్లపూడి గ్రామాల్లోని రామ మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సైదాపురం, కలిచేడు, చాగణం గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లోనూ పూజలు చేయడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

కాకాణి దోపిడీతో సర్వేపల్లి సర్వనాశనం : సోమిరెడ్డి



వెంకటాచలం: టీడీపీలో చేరిన వారితో సోమిరెడ్డి



పొదలకూరు: ఎన్నికల ప్రచారంలో సోమిరెడ్డి శృతిరెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 17: వైసీపీ పాలనలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి, అక్రమాలు, మైనింగ్ దోపిడీలతో సర్వనాశనమైన సర్వేపల్లి నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వేదాయపాళెంలో ఆయన కార్యాలయంలో బుధవారం మండలంలోని చవటపాళెం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ తన నాయకత్వంలోనే సర్వేపల్లికి పూర్వ వైభవం వస్తుందని ప్రజలు నమ్ముతున్నారని, మే 13న జరిగే ఎన్నికల్లో తాను తిరుగులేని మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

● **తోటపల్లిగూడూరు:** తోటపల్లిగూడూరు, ఇసుకపాలెం గ్రామాలలో బుధవారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, నాయకులు బొమ్మి సురేంద్ర, మన్యం జితేంద్రగౌడ్, మన్యం కిరణ్‌గౌడ్, మధుగౌడ్, ఇంగిలాల నిర్మలమ్మ, ఇంగిలాల చైతన్య, ఇంగిలాల శివయ్య పాల్గొన్నారు. వేదాయపాలెం సోమిరెడ్డి నివాసంలో వెంకన్నపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు బండి శ్రీకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సోమిరెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, చింత సీతారామయ్య పాల్గొన్నారు.

తెలుగుదేశంలో చేరికలు

మనుబోలు: కట్టువపల్లి గ్రామానికి చెందిన ఐదు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. గ్రామ టీడీపీ నాయకులు సన్నారెడ్డి నందగోపాల్‌రెడ్డి, చిన్న, పిడూరు మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీకి పునాది యువశక్తి

పొదలకూరు: తెలుగుదేశం పార్టీకి పునాది యువశక్తి అని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, దేవినేని శరత్, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, రావూరు సుధీర్, పాల్గొన్నారు. మరోవైపు తాటిపర్తిలో సోమిరెడ్డి కోడలు సోమిరెడ్డి శృతిరెడి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలిరెడ్డి హనుమారెడ్డి, సుబ్బిరామిరెడ్డి, పల్లారపు కృష్ణయాదవ్, కండే మస్తానయ్య, సుజిత్‌రెడ్డి, పార్లపల్లి రమేష్‌రెడ్డి, కడియాల లక్ష్మీ, తిరుపాల్ రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లిం మైనారిటీల సంక్షేమం

ముత్తుకూరు : ముస్లిం మైనారిటీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమార్తె సోమిరెడ్డి సింధురెడ్డి తెలిపారు. ముత్తుకూరు షాదీ మంజిల్‌లో బుధవారం మైనారిటీ నాయకులు షేక్ అబ్దుల్ షఫీవుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మైనారిటీ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, బిందురెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు ఖాదర్‌బాషా, కరిముల్లా, షబ్బీర్, అలారి రమణమ్మ, ప్రసాద్, ఏడుకొండలు, మణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం టీడీపీ లక్ష్యం

వెంకటాచలం: మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తెలుగు దేశం పార్టీ పనిచేస్తోందని సోమిరెడ్డి సింధురెడ్డి తెలిపారు. గూడ్లూరువారి పాళెంలో బుధవారం ఉదయం జరిగిన తెలుగు మహిళా ఆత్మీయ సమావేశంలో బిందురెడ్డితో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, ఈపూరు మురళీధర్‌రెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, ముంగర దశయ్య, దువ్వూరు లక్ష్మమ్మ, హేమలత, బెల్లంకొండ కిష్టమ్మ తదితరులున్నారు. పుంజులూరుపాడులో జరిగిన ఎస్సీ సోదరుల ఆత్మీయ సమావేశంలో బిందురెడ్డితో కలిసి సింధురెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, జెన్ని రమణయ్య, దాసి చక్రధర్ తదితరులు ఉన్నారు.

సోమిరెడ్డి విజయానికి సమష్టిగా కృషి చేయాలి

సోమిరెడ్డి విజయంలో యువత కీలక పాత్ర పోషించాలని, ఆ దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ పిలుపునిచ్చారు. వెంకటాచలంలో బుధవారం సాయంత్రం తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వల్లూరు రమేష్‌నాయుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో కందిమళ్ల సతీష్ నాయుడు, నలబాలపు వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి

పొదలకూరు, ఏప్రిల్ 17: వైసీపీ ప్రభుత్వం ముస్లింలను అణచివేసిందని తెలుగుదేశం ప్రభుత్వంలోనే మైనారిటీలు అభివృద్ధి చెందుతారని తిరుపతి పార్లమెంటు మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ జమీర్‌బాషా, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మైనారిటీ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కార్పొరేషన్ ద్వారా మైనారిటీలను ఆదుకునేదని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ముస్లింల బతుకులు బాగుపడాలంటే రాష్ట్రంలో చంద్రబాబు రావాలని, సర్వేపల్లిలో సోమిరెడ్డి వస్తేనే సాధ్యపడుతుందని తెలిపారు. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల ముస్లిం మహిళలు ప్రయాణాలు సాగించేటప్పుడు మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, ముస్లింలకు ప్రత్యేక మసీదు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సర్వేపల్లి ఎన్డీయే ఉమ్మడి అభ్యర్థి సోమిరెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షుడు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలు చాలా ఇబ్బందులుపడ్డారని, అక్రమ కేసులు కూడా మోపారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, స్టేట్ మైనారిటీ కార్యదర్శి అమీర్‌బాషా, వెంకటాచలం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షరీఫ్, మైనారిటీ నాయకుడు షేక్.మస్తాన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బస్సు షెల్టరు ఒక చోట.. ఆగేది మరోచోట



వెంకటాచలంలో కసుమూరు రోడ్డు కూడలికి దూరంగా ఉన్న బస్సు షెల్టరు

వెంకటాచలం, ఏప్రిల్ 17 : బస్సు షెల్టర్లు ఒక చోట ఉంటే... బస్సులు మరో చోట ఆగుతుండడంతో అవస్థలకు గురికావాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జాతీయ రహదారుల శాఖ వారు రహదారి వెంట ప్రతీ గ్రామానికి ఇరువైపులా బస్సు షెల్టరు నిర్మించారు. అయితే గ్రామాల కూడలి సమీపంలో కాకుండా ఫర్లాంగు దూరంలో నిర్మించారు. బస్సులు మాత్రం ఆయా గ్రామాల కూడలి వద్దనే ఆపుతున్నారు. దీంతో ప్రయాణికులు దూరంగా ఉన్న బస్సు షెల్టర్ల వద్ద కాకుండా కూడలి వద్దనే బస్సుల కోసం వేచి ఉంటున్నారు. దీంతో బస్సు షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులు మాత్రం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డుపక్కనే నిలబడి తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సు షెల్టర్లను తమ గ్రామాల రోడ్ల కూడలి వద్ద నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని, ఈ విషయంపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సులు రాక ప్రయాణికుల అవస్థలు

కోవూరు, ఏప్రిల్ 17: జాతీయ రహదారి విస్తరించడంతో కోవూరు వైపు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రవేటు టౌన్ బస్సులు, ఆటోలపై ఆధారపడాల్సి వస్తోందని స్థానికులు, వ్యాపారులు వాపోతున్నారు. గతంలో నియోజకవర్గ కేంద్రమైన కోవూరు పట్టణం, గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేవి. దూర ప్రాంతాలైన పొదిలి, కందుకూరు, సింగరాయకొండ, కావలి బస్సులు కోవూరు మీదుగా నెల్లూరుకు నడిచేవి. అల్లూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలాల గ్రామాల బస్సులు కూడా ప్రయాణికులతో రద్దీతో తిరిగేవి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నియోజకవర్గ కేంద్రమైన కోవూరుకు ఆర్టీసీ బస్సుల్ని నడపాలని, కనీసం నెల్లూరుకైనా ఆర్టీసీ టౌన్ సర్వీసుల్ని నడపాలని కోరుతున్నారు.

నామినేషన్ల దాఖలుకు ఏర్పాట్లు

కోవూరు, ఏప్రిల్ 17: శాసనసభ ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గానికి నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభం కానుంది. నామినేషన్ల దాఖలుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లను బుధవారం పూర్తిచేశారు. నామినేషన్లను స్వీకరించే ఎన్నికల కార్యాలయమైన తహసీల్దారు ఆఫీసులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణకు 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలోనికి జనం మూకుమ్మడిగా ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. రిటర్నింగ్ అధికారి సేతుమాధవన్, అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి విజయశ్రీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్ల పర్వానికి శ్రీకారం చుట్టిన నాడే ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయనున్నట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మధ్యాహ్నంలోగా నామినేషన్లను దాఖలుచేసేందుకు ఏర్పాటుచేసుకున్నట్లు తెలిసింది.

నేడు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నామినేషన్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 17 : కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయ డానికి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. తొలుత కోవూరులోని మందబయలు కూడలిలో గల ఆంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం కోవూరు తాలూకా కార్యాలయ ప్రాంగణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు.

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలి

● టీడీపీ కార్యాలయం ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం : తెలుగుదేశంపార్టీ కార్యాలయం ప్రారంభించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 17: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 14, 15 వార్డుల్లో బుధవారం కోవూరు ఎన్డీఏ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి ఆ వార్డుల ఇన్‌ఛార్జ్ బండ్ల కొండయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలందరూ కలసికట్టుగా పనిచేసి నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంవీ శేషయ్య, పి నరసయ్య, ప్రభాకర్‌రెడ్డి, బి మురళి, గుత్తా శ్రీనివాసులు, కాసా శ్రీనివాసులు, మోహన్‌బాబు, ఎన్‌వీప్రసాద్, టీడీపీ బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే విమర్శలు : నీలిమారెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నీలిమారెడ్డి

ఇందుకూరుపేట: ఓటమి భయంతోనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నిడి ముసలి గ్రామంలో బుధవారం ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరి ంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో రోడ్ల మరమ్మతులు చేయిస్తామని, తాగునీరు సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. రాబోవు సార్వ త్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నేబోయిన చెంచుకిషోర్‌యాదవ్, చిరమన సుధాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, దువ్వూరు శివకుమార్‌రెడ్డి, బండ్ల సుధాకర్, సతీష్‌రెడ్డి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డితోనే మాఫియాలకు అడ్డుకట్ట

కొడవలూరు : ప్రజల సంక్షేమమే వేమిరెడ్డి దంపతుల ధ్యేయం అని, నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక, మట్టి, మద్యం మాఫియాలకు అడ్డుకట్ట వేయాలంటే కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజుపాళెం గ్రామంలో ఎస్సీ కాలనీలో బుధవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ తిరిగి టీడీపీ గెలిస్తే జరిగే ప్రయోజనాలు గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు శ్రీరామ రక్ష అని తెలిపారు. ప్రజలు నియోజకవర్గంలో నల్లపరెడ్డి కుటుంబానికి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డిని, ఎంపీగా ప్రభాకర్‌రెడ్డిని ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరకటి మల్లిఖార్జున, నాసిన ప్రసాద్‌గౌడ్, తువ్వర ప్రవీణ్, కరేటి మూరళీ, మందిపాటి రమణారెడ్డి, సిదార్థ, బండి కుంబ్లే , బండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డితోనే కోవూరు అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే కోవూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకుంటుందని ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఏటూరి శివరామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం వారు మండలంలోని మినగల్లు గ్రామంలో అల్లం బాబు, తులసి సురేష్ అధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తు మీద ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో నారయ్య, శ్రీధర్‌రెడ్డి, బాలు సీను, టీడీపీ.బీజేపీ. జనసే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది కోడ్ ఉల్లంఘన కాదా.?



కరెంటు స్తంభంపై సీఎం జగన్ ఫొటో

మనుబోలు, ఏప్రిల్ 17: గ్రామాల్లో ఎన్నికల నియమావళిని అమలుచేయడంలో అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. మండల కేంద్రమైన మనుబోలులో నుడా తరఫున దేవాలయాలు, చర్చిల వద్ద సోలార్ స్తంభాలు ఏర్పాటుచేశారు. వాటికి సీఎం జగన్ చిత్రాలు ఉన్నాయి. అయితే కోడ్ కూసిన తరువాత అవి కనిపించకుండా చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. తాత్కాలికంగా కాగితాలు అంటించి వదిలేస్తున్నారు. కొద్దిరోజులకే అవి చిరిగి మరల ఇలా దర్శనమిస్తున్నాయి. అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి.



విలేకరులతో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

పేద.. పెత్తందారు ఎవరో 13న తెలుస్తుంది...!

- హత్యలు, దాడులు, కబ్జాల్లో మొనగాడు జగన్
- ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలపై దాడుల్లో ఆల్‌టైమ్ రికార్డు
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 17 : పేద ఎవరో.. పెత్తందారు ఎవరో...? వచ్చేనెల 13న ప్రజలే తేలుస్తారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సీఎం జగన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో హత్యలు, దాడులు, కబ్జాలు, అరాచకాలు చేయడంతో జగన్ మొనగాడని దుయ్యబట్టారు. దోపిడీకి చిరునామాగా వైసీపీ ప్రభుత్వం మారిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మీద జరిగిన దాడుల్లో ప్రభుత్వం ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పిందని విమర్శించారు. పైగా పలు పథకాలు రద్దు చేసిన ఘనుడు జగనేనన్నారు. వైసీపీ విజయానికి ఎంతో కృషిచేసిన వైఎస్ వివేకానందరెడ్డిని ఎవరు చంపారో జగన్ చెల్లెళ్లు వీధికెక్కి చెబుతుంటే, విచారణ చేయించలేని అసమర్థుడు ఈ ముఖ్యమంత్రి అని ఆరోపించారు. ఆయన హత్యను కూడా గత ఎన్నికలలో వాడుకున్నారన్నారని విమర్శించారు. ఆస్తులు, అధికారం, ఆధిపత్యం కోసం విచక్షణ రహితంగా వైఎస్ వివేకాను హత్యచేసి ఆ నేరం చంద్రబాబు మీద వేయలేదా ? అని ప్రశ్నించారు. తిరుమల పింక్ డైమండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రాగానే కేసును వెనక్కు తీసుకున్న నేత జగనేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, తిరుమల నాయుడు, మాతంగి కృష్ణ, పనబాక భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్ఐ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: మండలంలోని యర్రబల్లిగడ్డ వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.50 లక్షల నగదును బుధవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఇత్తడి నారాయణ, తన సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. సీతారామపురం మండలం బాలాయపల్లికి చెందిన ముత్తంశెట్టి కేశవరావు, వెంకటేశ్వర్లు కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని శకునాలపల్లికి వెళుతన్నారు. వాహన తనిఖీల్లో భాగంగా యర్రబల్లిగడ్డవద్ద వారి వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1.50 లక్షల నగదు దొరికింది. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగదును ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డికి అప్పగించారు. తదుపరి చర్యల్లో భాగంగా నగదును ట్రెజరీలో జమ చేస్తామని వారు తెలిపారు.

అంగన్‌వాడీ ఆయాపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: అంగన్‌వాడీ ఆయా జీ.భారతిపై మండల నోడల్ అధికారి దేవరకొండ ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం రాత్రి తెలిపారు. ఉదయగిరిలోని ఇందిరానగర్, ఎస్సీ కాలనీల్లో సోమవారం జరిగిన వైసీపీ ప్రచారంలో భారతి పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె విచారణ జరిపి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు

- కన్నీటి పర్యంతమైన చామదల వాసులు

జలదంకి, ఏప్రిల్ 17: కావలి ముంగమూరుతోటల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఐదుగురికి బుధవారం స్వగ్రామమైన మండలంలోని చామదలలో అంత్యక్రియలు జరిగాయి. మృతులను కడసారి చూసేందుకు చామదల గ్రామస్థులతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చారు. దీంతో చామదల ఎస్సీకాలనీ జన సందోహంతో నిండిపోయింది. దావులూరి శ్రీనివాసులు కుటుంబానికి చెందిన ఐదుగురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మంచి వ్యక్తికి ఇలా జరగడమేమిటంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడు శ్రీనివాసులు కూతురు, సోదరుడు శ్రీరాములు రోదనలు మిన్నంటాయి. భారీ జన సందోహం మధ్య అంత్యక్రియలు జరిగాయి.

కూటమి ప్రభుత్వంలో చిరువ్యాపారులకు రక్షణ : వినోద్



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 17 : రానున్న కూటమి ప్రభుత్వంలోనే చిరువ్యాపారులకు రక్షణ ఉంటుందని టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణను గెలిపించాలని కోరుతూ నగరం లోని 51వ డివిజన్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. చిరువ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. టీడీపీకి ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

రేపు ప్రభుత్వ పింఛనుదార్ల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా సర్వ సభ్య సమావేశం శుక్ర వారం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. సాయంత్రం 4 గంటలకు భక్తవత్సల నగర్‌లోని పెన్షన్ భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందని, సుశీల నేత్రాలయం వారు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌కే కా లేషా సాహెబ్ అన్ని ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పి స్తారని, పెన్షనర్లు కుటుంబంతో హాజరుకావాలని కోరారు.

దళితులను వేధించిన వారికి టికెట్లు!

అల్లూరు, ఏప్రిల్ 17 : దళితులను వేధించినా, హత్య చేసిన వారికి వైసీపీలో ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు ఇచ్చేస్తారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి అన్నారు. దళితుల శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులుకు 18 నెలల జైలు శిక్ష విధిస్తూ వెలువడిన తీర్పుపై ఆయన దళితులతో కలసి అల్లూరు పాతబస్టాండు కూడలి వద్ద బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో దళితులను అన్యాయంగా శిరోముండనం చేసిన కేసులో తోట త్రిమూర్తులుకు ఐదేళ్ల జైలు శిక్షకు బదులు 18 నెలలు మాత్రమే జైలు శిక్ష వేయడం దారుణమైన పరిణామమన్నారు.

పిచ్చి కుక్క దాడిలో బాలుడికి గాయాలు



ఉలవపాడు : పిచ్చి కుక్క దాడిలో 4 ఏళ్ల బాలుడికి గాయాలయ్యాయి. మండలంలోని వీరేపల్లి పంచాయతీ పరిధిలోని తూర్పు ఎస్టీ సంఘంలో మంగళవారం రాత్రి సంతోష్‌కుమార్ తన ఇంటి వద్ద ఉండగావీధి కుక్క ఒకటి ఉన్నపలంగా పిల్లాడి కాలు నోటకరచి లాక్కొని వెళ్లే ప్రయత్నం చేసింది. గమనించిన యువకులు కాపాడారు. కుక్కల బెడద ఎక్కువైయిందని పంచాయతీ అధికారులు పట్టించుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	144
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 7010
వెండి కిలో ధర	రూ. 87,100
వెండి ఒక గ్రాము	రూ. 89.10

ఎంపీగా గెలవగానే 24వ డివిజన్ దత్తత

● పల్లెపాడు తరహాలో కనుపర్తిపాడు, కల్లూరుపల్లి అభివృద్ధి ● కోటంరెడ్డితో రోడ్‌షోలో వేమిరెడ్డి


రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న వీపీఆర్, కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 17 : తాను నెల్లూరు ఎంపీగా గెలిచిన మరుక్షణమే 24వ డివిజన్‌ను దత్తత తీసుకుని కనుపర్తిపాడు, కల్లూరుపల్లి ప్రాంతాలను అభి వృద్ధి చేస్తానని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ రూరల్ ఎమ్మెల్యే అభ్య ర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి బుధవారం కనుపర్తిపా డులో రోడ్‌షో నిర్వహించారు. వేమిరెడ్డి మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి అభ్యర్థన మేరకు 24వ డివిజన్‌ను దత్తత తీసుకుంటున్నానన్నారు. ఇందుకూరుపేట మండలం పల్లెపాడును అభివృద్ధి చేసిన తరహాలోనే కనుపర్తిపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కోటంరెడ్డి మాట్లాడుతూ మే 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటేసి తనను రూరల్ ఎమ్మెల్యేగా, ఎంపీగా వీపీఆర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాగా, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీలోకి చేరారు. 18, 36, 25, 29 డివిజన్లు, రూరల్ మండలంలోని కొత్తవెల్లంటికి చెందిన వారు శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఏపీ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ బుగ్గవరపు శ్రీహర్ష, షేక్ అరాఫత్, రాజ్‌భారత్ మర్యాదపూర్వకంగా శ్రీధర్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. కోటంరెడ్డి కుటుంబ సభ్యులు 1వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

తెలుగుదేశంతోనే ప్రజారంజక పాలన


ఎన్నికల ప్రచారంలో నారాయణ, కోటంరెడ్డి, అజీజ్

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 17 : తెలుగుదేశం పార్టీతోనే ప్రజారంజక పాలన సాధ్యమవు తుందని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 51, 52 డివిజన్లలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తో రోజురోజుకూ ప్రజాదరణ పెరగడం ఆనందంగా ఉంద న్నారు. జగన్‌రెడ్డి పుణ్యమా అని బిల్డర్లు, వ్యాపారస్తులు, రియల్టర్లతోపాటు పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు పారి పోయారని విమర్శించారు. నిరుద్యోగం పెరిగిపోవడంతోపా టు అన్ని వ్యవస్థలూ దెబ్బతిన్నాయన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే విజన్ కలిగిన చంద్రబాబునాయుడిని ముఖ్య మంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైకిల్ గుర్తు కు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనూరాధ, పొంగూరు రమా దేవి, సింధూర, శరణి, మామిడాల మధు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు టీడీపీ అండ..

రానున్న టీడీపీ ప్రభుత్వంలో విశ్వబ్రాహ్మణులకు అండగా ఉండి నామినేటెడ్ పదవులు ఇస్తామని మా జీ మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. నగరంలోని 48వ డివిజన్‌లో నిర్వహించిన విశ్వబ్రా హ్మణుల ఆత్మీయ సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున విశ్వ బ్రాహ్మణులు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్ర మంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, విశ్వబ్రాహ్మణుల నేత పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!

● భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి ● వీధివీధిన సీతారాముల కల్యాణం ● భారీ ఎత్తున అన్నదానం


వేదాయపాళెం త్యాగరాజ మందిరంలో సీతారామ కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నగరంలో బుధవారం సీతారామ కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రజలు భక్తిశ్రద్ధలతో నవమి పండుగను జరుపుకున్నారు.

● శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణం భక్తులకు కనువిందు చేసింది. ఆలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో శోభాయమానంగా వేదికను తీర్చిదిద్దారు. స్వర్ణాభరణాలు, పుష్పాలతో సీతా రాములను వధూవరులుగా అలంకరించి మంగళ వాద్యాలతో ఊరేగింపుగా ఆలయం నుంచి కల్యాణ వేదికకు చేర్చారు. పట్టు వస్త్రాలను తెలుగుగంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి దంపతులు, ముత్యాల తలంబ్రాలను 1వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జీ కపర్ది దంపతులు సమర్పించారు. అర్చకుడు నరేష్ స్వామి సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా, వ్యాఖ్యాన సహితంగా నిర్వహించారు. భక్తుల శ్రీరామ నామ స్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. శబరి శ్రీరామక్షేత్రం పునఃనిర్మాణ కర్త చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకకు ఉభయదాతలుగా పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్య, పిడూరు భానుప్రకాష్‌రెడ్డి, నాగమణి దంపతు లు వ్యవహరించారు. కార్యక్రమాలను చంద్రారెడ్డి సుబ్బారాజు, అన్నం దయాకర్ గౌడ్, దద్దోలు రమణయ్య, బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్, మండ్ల ఈశ్వరయ్య, రామ్‌నగర్ యూత్ పర్యవేక్షించారు.


శ్రీరామ చంద్ర మూర్తికి జై..

● తల్పగిరి రంగనాథస్వామి ఆల యంలో సీతారామ కల్యాణం కనుల పండువగా జరిగింది. రంగనాయకమ్మ పంగున్యోత్త ఉత్సవాల్లో భాగంగా ఉద యం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామికి, సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రస్వామికి విశేష తిరుమంజన సేవ జరిపారు. అనంతరం శ్రీరామ అవతార ఘట్టం పురాణ ప్రవచనం, శ్రీరంగనాయక మ్మకు తిరుమంజనం సేవలు జరిగాయి. సాయంత్రం ప్రాకారోత్సవం, ఊంజల్ సేవలు నయనానంద కరంగా జరిగాయి. అనంతరం రంగనాథస్వామికి హనుమంత వాహనంపై పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ధర్మకర్తలు, ఉభయకర్తలు, ఆలయ సహాయ కమిషనర్ డీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

● హోల్‌సేల్ మెడికల్స్ అసోసియేషన్ హాలులో ప్రత్యేక పూజలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్, వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు అయితా భాస్కర్, లీలామోహన్, మిగిలిన సభ్యులు పాల్గొన్నారు.

● విజయమహల్ సెంటర్‌లో వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. భారీ ఎత్తన అన్నదానం చేశారు.

● ఫణతులవారివీధిలో మిత్రమండలి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి, సీతారాముల కల్యాణం వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం వాసవీ కన్యకా పరమేశ్వరి సత్సంగ బృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం జరిగాయి.

● పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పలు ఆలయాలు, కొన్ని అపార్టు మెంట్లలోనూ కల్యాణోత్సవాలు నిర్వహించారు.

● వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. వేద పండితుడు గోసుకొండ వెంకట రమణ శర్మ బృందం వ్యాఖ్యాన సహితంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి ఊంజల్‌సేవ, గజవాహ న ఉత్సవాలు జరిగాయి. శ్రీత్యాగరాజస్వామి మందిరం కమిటీ పర్యవేక్షించింది.


హోల్‌సేల్ మెడికల్స్ అసోసియేషన్ సభ్యుల పూజలు


హనుమంత వాహనంపై శ్రీరంగనాథుడు

ఘనంగా తిరుచ్చి ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 : నగరంలోని సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం ధ్వజారోహణ జరిగింది. ఈ సందర్భంగా విశేష పూజలు, కొడిముద్దల వితరణ చేశారు. మధ్యాహ్నం తిరుచ్చి ఉత్సవం, రాత్రి కమలం వాహన అలంకారంలో పూలంగిసేవ జరిగాయి.

ముగిసిన సప్తాహం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 : నగరంలోని రేబాలవారివీధి పీటీజీ రాజ్ టవర్స్‌లో పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరామ కథా తరంగిణి సప్తాహం బుధవారం రాత్రితో ముగిసింది. చివరిరోజు రామాయణంలోని ఉత్తరాకాండపై డాక్టరు చీమకుర్తి వెంకటేశ్వరరావు ప్రవచించారు. హనుమంతుడు, రావణుడి జన్మవృత్తాంతం, రావణుడు కార్తవీర్యార్జునుల యుద్ధం, సీతాపరిత్యాగం, లవకుశల జననం, అశ్వమేధ యాగం, రామావతారం పరిపూర్తి తదితర ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమాలను పద్యసారస్వత పరిషత్ కార్యవర్గం, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజియన్ చైర్మన్ ఎన్ బలరామయ్యనాయుడు పర్యవేక్షించారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయ మూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



గ్రామాల్లో మార్మోగిన రామనామం

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 17 : శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం నెల్లూరు రూరల్లోని గ్రామాల్లో శ్రీరాముని నామస్మరణ మార్మోగిం ది. రామమందిరాలను శోభాయమానంగా అ లంకరించి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలం కరణలు, పూజలు చేశారు. ఊరూర సీతారా మ కల్యాణం వైభవంగా జరిపారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంచి అన్న దానం చేశారు. వేదగిరి క్షేత్రంలో శ్రీరామ నవమి సంబరాలు నిర్వహించారు. సౌత్ మోపూరులో సీతారాముల కల్యాణోత్సవం, గ్రామోత్సవం కనుల పండువగా జరిగాయి. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నా రు. ములుముడి, గొల్లకందుకూరు, వెల్లంటి గ్రామాల్లోనూ ఉత్సవాలు జరిపారు.


సౌత్‌మోపూరు గ్రామోత్సవంలో సీతారాములు

ఏసీ స్టేడియంలో...

నెల్లూరు (విద్య): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. వాకర్స్ ఇం టర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామ య్య నాయుడు మాట్లాడుతూ మతసామర స్యానికి ప్రతీకగా అన్ని పండుగలను నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులంతా శ్రీ రాముడు చూపిన మార్గంలో నడుస్తూ సేవాభావంతో కార్యక్రమాలు నిర్వ హించాలని కోరారు. అనంతరం రాఘవాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వడపప్పు, పానకం అందజే శారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్య దర్శి స్వర్ణ ర మేష్‌బాబు, నాయకులు మేకల నరేం ద్ర రెడ్డి, చిం తల అమరేం ద్ర రెడ్డి, డాక్ట ర్ అంకిరెడ్డి, పొన్నం రవి చంద్ర పా ల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 17: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరంలోని చౌదరి పెట్రోల్ బంక్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ సిబ్బంది ప్రజలకు, పెట్రోల్ బంకు సిబ్బందికి అవగాహన కల్పించారు. నెల్లూరు ఫైర్ స్టేషన్ అధికారి ఎస్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఆక్సిజన్ అందకుండా డీసీపీ పౌడర్ వాడాలని, తీవ్రత ఎక్కువైనప్పుడు ఫోమ్ వాడాలని సూచించారు.

యూనియన్ పేరుతో బెదిరింపు : శంకర్ కిశోర్

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 17 : కావలిలోని ఓ స్కానింగ్ కేంద్రంపై చర్య తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యను కోరితే వైద్య శాఖ యూనియన్ నేతలు తమను బెదిరిస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పెనుమల్లి శంకర్ కిశోర్ ఆరోపించారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కావలికి చెందిన కత్తి శ్రీనివాసులు భార్య అరుణ శ్రీలక్ష్మి అనారోగ్యంతో వైద్యుల సూచన మేరకు ఎమ్మారై స్కానింగ్ చేయించుకుందన్నారు. అయితే సదరు స్కానింగ్ సెంటర్ వారు తప్పుడు రిపోర్టు లు ఇవ్వడంతో చాలా సమయం గడిచి బాధితురాలికి వ్యాధి ముదిరి అపస్మారక స్థితికి చేరిందన్నారు. ఈ నేపథ్యంలో స్కానింగ్ సెంటర్‌పై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయడానికి వెళితే ఆయన దుర్భాషలాడారన్నారు. ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించడంతో వైద్య ఆరోగ్యశాఖ యూనియన్ నేతలు పోలీసులతో ఫోన్ చేయించి బెదిరించారన్నారు. ఏది ఏమైనా బాధితురాలు అరుణ శ్రీలక్ష్మికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్నా, ఫిరోజ్, రోగి భర్త శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులకు గంగమ్మతల్లి మట్టి బహూకరణ

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 17 : టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులకు ఆ పార్టీ తిరుపతి 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ గంగమ్మ తల్లి మట్టిని, శ్రీవారి ప్రసాదాలను, గరుడ చిత్రపటాన్ని బహూకరించారు. వాటిని బుధవారం నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో అందచేశారు. మునికృష్ణ మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతులు ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయాన్ని కైవసం చేసుకోవాలని వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాటకం వెంకటేష్, రాము, బండ్ల లక్ష్మీపతి, వినుకొండ బాబు, నరేష్‌బాబు, గోవర్ధన్ రాయల్, డీ నాగప్రతాప్, పీ మునిరాజా, జగ్గా చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


వేమిరెడ్డి దంపతులకు గంగమ్మతల్లి మట్టి, గరుడ చిత్రపటాన్ని అందచేస్తున్న కార్పొరేటర్ మునికృష్ణ

సవరణ

తేదీ:14-04-2024న ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్ నందు ప్రచురించబడిన శ్రీ పెనుశిల లక్ష్మినరసింహ స్వామి వారి దేవస్థానం పెంచలకోన క్షేత్రం బ్రహ్మోత్సవము టెండర్లు విషయమై అందులో టెండరు షెడ్యూల్ ఇవ్వబడిన తేదీ:18-04-2024 నుండి 20-04-2024 వరకు అందులో పొరపాటున తేదీ:24-04-2024న ప్రచురించడమైనది. టెండరు దారులు గమనించగలరు.

సం/- కె.విజయ సాగర్ బాబు, ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి





తిరుమలలో హనుమ వాహనంపై శ్రీరాముడి విహారం - సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం

వేడుకగా శ్రీరామనవమి



తిరుపతి కోదండరామాలయంలో రద్దీ

తిరుమల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా వేడుకగా జరిగాయి. రామాలయాల్లో భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో నవమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన సేవలను నిర్వహించారు.9 నుంచి 11 గంటల వరకు సీతారామ లక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవను నిర్వహించారు. తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలను, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు.సాయంత్రం 6.30 గంటలకు వాహనమండపంలో భక్తుడైన హనుమంతుడిపై శ్రీరామచంద్ర మూర్తిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి, పేష్కార్ శ్రీహరి, డిప్యూటీఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు.

పట్టాభిరాముడిని తాకిన ఉదయభానుడి కిరణాలు

వాకాడు, ఏప్రిల్ 17 : వాకాడు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలిరెడ్డి పాళెం పట్టాభిరామాలయంలో శ్రీరామనవమి పర్వదినాన మూల విరాట్టును సూర్య కిరణాలు పాక్షికంగా తాకాయి. ఉదయం 7గంటల ప్రాంతంలో దాదాపు 5 నిమిషాల పాటు సూర్యకిరణాలు స్వామి వారిని తాకాయని, తెల్లవారుజాము నుంచే భక్తులు వేచివుండి ఈ అద్భుత ఘటనను చూశారని ఆలయ ప్రధానార్చకులు దివి అనంతాచార్యులు, ధర్మకర్త కొడవలూరు భక్తవత్సల రెడ్డి తెలిపారు.



జిల్లాలో వలంటీర్ల రాజీనామాలు అధికారిక లెక్కల ప్రకారం వెయ్యి దాటాయి. ఎంత బలగం వున్నా, ఎన్ని వనరులున్నా ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ నేతలకు వలంటీర్లే దిక్కవుతున్నారు. అయితే ఎన్నికల కమిషన్ నుంచీ ఆంక్షలున్న కారణంగా వాటి నుంచీ తప్పించుకుని స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారానికి వినియోగించుకునేందుకు వారిపై రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో రాజీనామా చేసే వలంటీర్లకు ప్రత్యేకంగా ఆఫర్లు కూడా ఇస్తున్నారు. రాజీనామాలకు వస్తున్న ఒత్తిడిని బట్టి చూస్తుంటే అధికార పార్టీ ఎన్నికల్లో వలంటీర్లపై ఏ స్థాయిలో ఆధారపడుతోందో చెప్పకనే చెబుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వైసీపీ ప్రచారాలకు
వలంటీర్లే దిక్కు!

- రిజైన్ చేసి ప్రచారంలోకి రావాలంటూ వైసీపీ నాయకుల ఒత్తిడి
- రెండు నెలలకు రూ. 20 వేలు ఆఫర్‌తో పాటు జూన్‌లో మళ్ళీ కొనసాగింపు హామీ

జిల్లావ్యాప్తంగా వెయ్యిమందికి పైగా రాజీనామా

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం మంగళవారం నాటికి 1058 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం వరకూ 902 మంది విధుల నుంచీ తప్పుకోగా మంగళవారం మరో 156 మంది బాధ్యతల నుంచీ తప్పుకున్నారు. అత్యధికంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచీ 276మంది వలంటీర్లు రాజీనామా చేయగా సూళ్ళూరుపేట నుంచీ 264మంది, శ్రీకాళహస్తిలో 233మంది, వెంకటగిరి నుంచీ 149మంది, గూడూరులో 95మంది, తిరుపతిలో 34మంది, సత్యవేడులో అత్యల్పంగా ఏడుగురు రాజీనామాలు సమర్పించారు. అనధికారికంగా చూస్తే రాజీనామా చేసిన వారి సంఖ్య దీనికి రెట్టింపు కంటే ఎక్కువగా వుంది. వలంటీర్లు తమ రాజీనామా లేఖలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తున్నారు. వారు రికార్డు తయారు చేసుకుని ఎంపీడీవోలకు సమర్పించాలి. ఎంపీడీవోలు ఆ సమాచారాన్ని జిల్లా కేంద్రంలోని డీఎల్‌డీవోకు నివేదించాలి. సంబంధిత అధికారి అప్రూవ్ చేశాకే రాజీనామా అధికారికమవుతుంది. ఈ ప్రక్రియకు రెండుమూడు రోజులు పడుతున్నందున ఏరోజుకారోజు రాజీనామాల సంఖ్య అధికారికంగా ప్రకటించడం లేదు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన 23 మంది తొలగింపు

జిల్లాలో ఇప్పటి వరకూ ఎన్నికల నియమావళి ఉల్లంఘన కారణంతో తొలగించిన వలంటీర్ల సంఖ్య 23కు చేరింది. శ్రీకాళహస్తిలో అత్యధికంగా తొమ్మిది మందిని, సత్యవేడులో ఏడుగురిని, తిరుపతిలో ఐదుగురిని, గూడూరు, సూళ్ళూరుపేటల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 23మందిని ఇప్పటి వరకూ తొలగించారు.అధికార పార్టీ నేతలకు ఎంత అనుచరగణమున్నా, ఎన్ని ఆర్ధిక వనరులున్నా ఎన్నికల్లో మాత్రం ప్రధానంగా వలంటీర్లపైనే ఆధారపడుతున్నారు. గ్రామ, వార్డుల పరిధిలో వలంటీర్లకున్న విస్తృత పరిచయాలు, ప్రభావం ఇతరులకు వుండడం లేదు. ప్రతి యాభై ఇళ్ళకు ఒక వలంటీరు అందుబాటులో వుండడం, ఆ యాభై కుటుంబాలను తరచూ కలుస్తూ వుండడం, ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేస్తుండడం, ఇతరత్రా ప్రభుత్వ పనులకు కూడా జనం వారిపై ఆధారపడుతుండడం దీనికి కారణం. దీంతో ఏ కుటుంబం పరిస్థితి ఏమిటి? ఏ కులం లేదా ఏ మతం? ఎంతమంది ఓటర్లున్నారు? వారిలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నది ఎంతమంది? వారి నేపథ్యం? ఏ పార్టీకి సానుభూతిపరులు? వంటి సమాచారం వలంటీర్ల నుంచే రాబడుతున్నారు. వీటన్నింటికీ మించి ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులను, పార్టీ నేతలను కూడా వలంటీర్లే ప్రజలకు పరిచయం చేయాల్సిన పరిస్థితి. దీనికి మించి పంపకాలకు వలంటీర్లను మించిన నమ్మకమైన ప్రత్యామ్నాయం అధికార పార్టీ నేతలకు మరొకరు దొరకడం లేదు. ఈ అంశాలను దృష్టిలో వుంచుకుని అధికార పార్టీ నేతలు వలంటీర్లపైనే భారం వేస్తున్నారు. ఆ పనులు స్వేచ్ఛగా, నిరాటంకంగా జరగడం కోసం రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నారు.

చంద్రగిరిలో నగదు ఆఫర్

చంద్రగిరి నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామాలకు అధికార పార్టీ నేతలు నగదు ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు తమ పరిధిలోని వలంటీర్లను కలసి రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఒత్తిడి చేస్తున్నారు. అందుబాటులోకి రాని వారికి పదేపదే ఫోన్లు చేస్తున్నారు. రాజీనామా చేయడానికి ఇష్టపడని వారు ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకుని అందుబాటులో లేకుండా పోతున్నారు. నెలకు రూ. 5 వేల గౌరవ వేతనం పొందుతున్న సంగతి గుర్తు చేస్తున్న నాయకులు రాజీనామా చేస్తే ఏప్రిల్, మే నెలలకు గానూ రూ. 10 వేల చొప్పున రూ. 20 వేలు చెల్లిస్తామని ఆఫర్ ఇస్తున్నారు.జూన్‌లో పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని, ఆ నెల నుంచీ వలంటీర్లుగా మళ్ళీ కొనసాగిస్తామని నచ్చజెబుతున్నారు. ఒత్తిళ్ల కావచ్చు లేదా మొహమాటం కావచ్చు అదీ కాకుంటే నగదు ఆఫర్లకు మెత్తబడి కావచ్చు కానీ మొత్తంమీద జిల్లాలో అత్యధికంగా వలంటీర్ల రాజీనామాలు చంద్రగిరి నియోజకవర్గంలోనే నమోదయ్యాయి. ఇక్కడ కేవలం సోమ, మంగళవారాల్లోనే వెయ్యి మందికి పైగా రాజీనామా చేసినట్టు సమాచారం. అయితే అవి ఇంకా అధికారికంగా ప్రకటితం కాలేదు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశముంది. చంద్రగిరిలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా వలంటీర్ల రాజీనామాల సంఖ్య గణనీయంగా పెరగనుంది.

సార్వత్రికానికి సన్నద్ధం

- నేడు ఎన్నికల నోటిఫికేషన్
- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు



కలెక్టరేట్‌లో నామినేషన్ల హెల్ప్‌డెస్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారయంత్రాంగం సిద్ధమైంది.తిరుపతి పార్లమెంటుతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 13న జరగబోయే ఎన్నికలకు గురువారం ఉదయం నోటిఫికేషన్ విడుదల కానుంది.ఉదయం 11గంటల నుంచి ఆయా నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు.సెలవు దినాలు మినహా ఈ నెల 25వ తేదీ వరకు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల లోపు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు ఆర్వోలకు సమర్పించాల్సి ఉంటుంది.నామినేషన్ కేంద్రాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్కులు కూడా ఏర్పాటు చేశారు. నేడు దశమి, శుక్రవారం ఏకాదశి కావడంతో పలువురు అభ్యర్థులు ఈ రెండురోజుల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ రిటర్నింగ్ అధికారి హోదాలో కలెక్టరేట్ కార్యాలయంలోనే నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నారు.గూడూరు నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్, సూళ్ళూరుపేట నియోజకవర్గానికి సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఆర్.చంద్రముని నామినేషన్లు స్వీకరిస్తారు. వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి మున్సిపల్ ఆఫీస్‌లో ఆర్వో అయిన జేసీ ధ్యానచంద్ర, చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఎ.నిషాంత్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఆర్వో అయిన కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఎస్.రవిశంకర్‌రెడ్డి, సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో అయిన ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు నామినేషన్లు స్వీకరిస్తారు.

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు సమర్పించవచ్చు

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు సమర్పించే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించింది. సువిధ యాప్(పోర్టల్‌లో) ద్వారా నామినేషన్లు సమర్పించి తరువాత ఆయా పత్రాల కాపీలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

అభ్యర్థుల లెక్క పక్కా.. : ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95లక్షల వరకు ఖర్చు చేయడానికి అవకాశం ఉంది. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నికల ఖర్చును పరిగణనలోకి తీసుకుంటారు. 25వ తేది వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. 26న పరిశీలిస్తారు. ఉపసంహరణకు 29వ తేదీ వరకు అవకాశం ఉంటుంది.నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థి తన వెంట నలుగురిని మాత్రమే తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది.ర్యాలీగా వస్తే కూడా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి కనీసం వంద మీటర్ల దూరంలోనే నిలిపివేయాల్సివుంటుంది.

ఒలంపిక్స్‌లో రాణించాలి



తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రానున్న సింగపూర్ టోర్నమెంట్‌తో పాటు ఒలంపిక్స్‌లో బాగా రాణించాలని స్వామివారిని కోరుకున్నట్టు ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆమె దర్శించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రానున్న టోర్నమెంట్స్‌లో బాగా ఆడాలని స్వామిని ప్రార్థించానన్నారు.బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ఆమెకు ఈ సందర్భంగా బలరాముడి ప్రతిమను బహూకరించారు.

రూ.16.97 లక్షల సీజ్

- అదుపులో ముగ్గురు వ్యక్తులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17: సరైన ధ్రువపత్రాలు లేకుండా, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.16.97 లక్షలను అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం సీజ్ చేశారు. సీఐ రామచంద్రారెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు జరిగాయి. కాటన్ మిల్లు వద్ద ప్రకాశం జిల్లాకు చెందిన ఒకరు ద్విచక్ర వాహనంలో రూ.12,98,500 తీసుకెళుతుండగా పట్టుకున్నారు. అలాగే మంగళం రోడ్డులోని డీమార్టు వద్ద అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.99 లక్షలు, తిరుపతి కేటీ రోడ్డులో రూ.2లక్షలు తీసుకెళుతుండగా సీజ్ చేశారు. ఈ నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.

స్మగ్లర్ల ఆచూకీ సులభతరం

- శేషాచలం అడవుల్లో రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాల ఏర్పాటు
- ఎఫ్ఆర్వో మొబైల్‌కు క్షణాల్లోనే ఫొటోలు.. వీడియోలు



శేషాచల అడవుల్లో అమర్చిన రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాలు - సోలార్‌తో పనిచేసే కెమెరాలు

మంగళం, ఏప్రిల్ 17: శేషాచలం అడవుల్లో వన్యప్రాణులు, ఎర్రచందనం స్మగ్లర్ల ఆచూకీ ఇక సులభంగా కనిపెట్టేయవచ్చు. ఇందుకోసం అడవుల్లోని వివిధ ప్రాంతాల్లో అధునాతన టెక్నాలజీతో కూడిన బ్యాటరీతో పనిచేసే 20 రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాలను అటవీశాఖ ఏర్పాటు చేసింది. వీటితోపాటు సోలార్ విద్యుత్‌తో పనిచేసే 20 కెమెరాలను కూడా పెట్టారు. ఒక్కో కెమెరా విలువ దాదాపు రూ.40వేలు. వీటిల్లో 'రియల్ టైమ్' కెమెరాల ముందుకు వచ్చే ఏ వన్యప్రాణి లేదా మనుషులనైనా ఫొటోలుతో పాటు వీడియోలను తీసి కూడా క్షణాల్లోనే మొబైల్ కనెక్టివిటీ ఉన్న ఎఫ్ఆర్వోలకు పంపిస్తాయి.

గతంలో ఇలా.. : గతంలో ఏర్పాటు చేసిన కెమెరాలు కూడా ఫొటోలు తీసేవి. కానీ వాటి వద్ద ఏర్పాటు చేసిన చిప్పులోనే భద్రపరిచేవి. ఆ తర్వాత ఈ చిప్పును తీసుకుని కంప్యూటర్ల ద్వారా అధికారులు చూడాల్సి వచ్చేది. అప్పటికే సమయం మించిపోతుండేది.

తొలిసారిగా 'రియల్‌టైమ్' కెమెరాలు

శేషాచలం అడవుల్లో తొలిసారిగా రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాలు వినియోగిస్తున్నాం. సెల్‌ఫోన్ సిగ్నల్ ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. బ్యాటరీ సాయంతో పనిచేసే వీటివల్ల వన్యప్రాణులు, ఎర్రచందనం స్మగ్లర్ల కదలికలు తెలుస్తాయి. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో మరిన్ని 'రియల్ టైమ్' కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నాం.

- సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరావు





అన్న 'ఫిగర్' చెప్పమన్నాడు



'అన్న పంపించాడు' అంటూ తమ దగ్గరకు వాళ్లు రాగానే తిరుపతి నగరంలోని వ్యాపారులు గడగడ వణికిపోతున్నారు. ఎన్నికల ఖర్చు భారీగా పెరిగిందంటూ వసూల్ రాజాలను తన తరపున రంగంలోకి దించారని చెబుతున్నారు. నగరంలోని రియల్టర్లు, బిల్డర్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులను వసూల్ రాజాలు టార్గెట్‌గా చేసుకున్నారు. తిరుపతిలో పేరు మోసిన ఒక బిల్డర్‌కు కోటి రూపాయలు 'ఫిగర్' చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. హమ్మో.. కోటా? అని అతను ఆందోళన పడుతూ ఉంటే, మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో జరిగిన మేళ్లను వివరించి, భవిష్యత్తులో దున్నేసుకోవచ్చని భరోసా ఇచ్చారని తెలిసింది. ఆసుపత్రులకు అయితే, స్థాయిని బట్టి 'ఫిగర్' నిర్ణయించారు. హోటళ్లనూ ఊడ్చేస్తున్నారని అంటున్నారు. పార్టీ ఫండ్ పేరుతో కొనసాగుతున్న వసూళ్ల పర్వం ఇప్పుడు చర్చగా మారుతోంది. విశేషం ఏమిటంటే.. ఇలా వసూళ్లకు పంపే చోటా నేతలకు కమీషన్లు కూడా ఇస్తున్నారని చెప్పుకుంటున్నారు. దీంతో అన్న అనుచరగణం కొరడాలు బయటకు తీసి రంగంలోకి దిగుతున్నారని తెలిసి, కొందరు బిల్డర్‌లు సమ్మర్ ట్రిప్‌లకు చెక్కేస్తున్నట్టు తెలిసింది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

లీకులు...కాసులు



ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడబ్బా నాలుగు రాళ్లు ఎనకుసుకునేది.. అనుకుంటున్నారు వైసీపీ నాయకులు. నిజమే పాపం జగన్‌ను పీఠం ఎక్కించాక పథకాలకు తప్ప పనులకు పైసా ఇవ్వకపాయ. కాంట్రాక్టులు చేసుకుని నాలుగు కాసులు మిగుల్చుకునే అవకాశం రాకపాయ. అందుకే ఎన్నికల రోజుల్లో చిత్రమైన ఎత్తుగడ వేస్తున్నారు. ఇటీవల వడమాలపేటకు చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు పార్టీ మారబోతున్నారనే ప్రచారం జరిగింది. దాంతో వైసీపీ పెద్దలు రంగంలోకి గబీమని దూకేశారు. ఇట్టాంటి వేళ ఇదేమి సామీ అని చెరో రెండు లక్షలు చేతల్లో పెట్టి సర్దేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిజానికి వాళ్లకి పార్టీ మారే ఆలోచన లేదు. కావాలనే సోషల్ మీడియాకు టీడీపీలో చేరుతున్నట్టు లీకులు ఇచ్చారంట. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కూడా ఇదే విధంగా కొందరు లీకులిచ్చి కాసులు రాబట్టుకున్నట్టు చెబుతున్నారు. ఇది చూసి పార్టీ మారబోతుండారంటూ లీకులు ప్రచారం చేసుకునే వాళ్ల సంఖ్య పెరిగింది. నిజమేదో, అబద్ధమేదో తెలీక పాపం నాయకులు జేబులు ఖాళీ చేసుకోక తప్పడం లేదు అని చెప్పుకుని జనం నవ్వుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్

పెద్ద నోటు... ఈసారి లోటు



ఎన్నికలొచ్చాయంటే నగదు, మద్యందే కీలక భూమిక. నోటిఫికేషన్ మొదలు ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లేవరకూ ఈ రెండే ప్రభావం చూపిస్తుంటాయి. ఓటర్లను దారిలోకి తెచ్చుకోవాలన్నా, ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం అంతాఇంతా కాదు. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులివి. అభ్యర్థుల అదృష్టమో.. ఓటరు దురదృష్టమో తెలియదు గానీ గడచిన రెండు ఎన్నికల్లోనూ పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 సాధారణ ఎన్నికల్లో పెద్ద నోటు అంటే 1000 ఒక్కటే. ఆ తర్వాత నోట్ల రద్దుతో వెయ్యి నోటు అడ్రస్ లేకుండా పోయింది. 2019 ఎన్నికల తర్వాత రూ. 2000 నోటు వచ్చింది. ఇప్పుడు ఆ నోటూ కనిపించడంలేదు. జేబులోకి చెయ్యిపోనిస్తే 500 నోటు లేదా 200 నోటు పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఓటరుకైనా నాయకుడికైనా ఇచ్చే పెద్ద నోటు ప్రస్తుతానికి ఇదే.. అలాగని ఒకటో రెండో నోట్లిచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు ఇప్పుడు పెద్ద నోట్ల వేటలో పడ్డారు.

- డక్కిలి

సత్యవేడులో గెలిచే పార్టీదే అధికారం

● సెంటిమెంట్


సత్యవేడులో గెలిచే పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ఒక నమ్మకం. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం తరువాత 2009 ఎన్నికలు మినహా మిగతా అన్ని ఎన్నికల్లోను ఇదే జరిగింది. 1983లో టీడీపీ అభ్యర్థి తలారి మనోహర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టింది. 1985లో మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీదే అధికారం. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.దాసు గెలుపొందగా కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 1994లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1999లో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామి గెలుపొందగా అప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2009లో మాత్రం టీడీపీ అభ్యర్థి హేమలత గెలుపొందిని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 2014లో టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2019లో వైసీపీ అభ్యర్థి ఆదిమూలం గెలుపొందగా వైసీపీ అధికారం చేపట్టింది.

- సత్యవేడు

మాట తప్పడు, మడమ తిప్పడు
నేను వున్నాను, నేను విన్నాను
విలువలు, విశ్వసనీయత
చెప్పాడంటే.. చేస్తాడంతే

.. 'ఒక్క ఛాన్సు' అంటూ 2018 పాదయాత్ర.. 2019 ఎన్నికల ప్రచారాల్లో విపక్ష నేతగా జగన్ హామీలిస్తూ చెప్పిన మాటలివి. వీటిని నమ్మి ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చారు. మరి.. ముఖ్యమంత్రిగా ఆయన ఐదేళ్లలో తిరుపతి జిల్లాకు సంబంధించి నాటి హామీలేవీ నెరవేర్చలేదు. 'చెప్పాడంటే చేయడంతే' అన్నట్లుగా వ్యవహరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బాలాజీ రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా చంద్రబాబు హయాంలో నిర్మించిన రాతి కట్ట

ఇంకా ఆరు నెలలు కాలేదా?

● గాలేరు- నగరి ప్రాజెక్టుకు నీళ్లొదిలేసిన జగన్ ● టెండర్లు రద్దు.. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో సరి

అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తా.
- 2018 జనవరి 6న సదుంలో, 16వ తేదీన వడమాలపేటలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ.



మోసం గురూ!

ప్రాజెక్టు నేపథ్యం

రాయలసీమ కరువు నివారణకు దివంగత ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో గాలేరు-నగరి ఒకటి. ఈ ప్రాజెక్టు రెండో దశలో 8 నుంచి 14 వరకు.. ఏడు ప్యాకేజీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినవి.

ప్రయోజనం కలిగే ప్రాంతాలు

తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాలు. ఈ ప్రాంతంలోని 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి.

'కాంగ్రెస్' హయాంలో అనుమతులతో సరి

ఉమ్మడి కడప జిల్లా నుంచి శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్లు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని చేర్చాలి. అక్కడ్నుంచి మల్లిమడుగు.. ఆపై పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి.దీనికోసం మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలి. మిగిలినవి కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్లతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ.2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. ఆ అంచనాలను 2008లో రూ.2526 కోట్లకు సవరించింది. వీటికి అనుమతి వచ్చిందే గానీ.. ఆరేళ్ల పాటు పనులు మొదలు కాలేదు.



బాలాజీ రిజర్వాయర్ వద్ద ఈ కాలువ తవ్వింది టీడీపీ హయాంలోనే

చంద్రబాబు వచ్చాక పరుగులు

2014లో చంద్రబాబు సీఎం కాగానే రూ.2526 కోట్లతో ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారు. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట.. అక్కడ్నుంచి మల్లిమడుగు రిజర్వాయరు వరకు కాలువ తవ్వకం పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు సామర్థ్యాన్ని 0.18 టీఎంసీల నుంచి 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ.56.08 కోట్లతో పనులు మొదలు పెట్టి.. రూ.25 కోట్లు ఖర్చుపెట్టారు. రూ.160 కోట్ల అంచనాతో మొదలు పెట్టిన వేణుగోపాల సాగర్‌కూ రూ.35 కోట్ల మేరకు పనులు జరిగాయి. కాలువ సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు కాగా, ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. టన్నెళ్ల నిర్మాణానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాకపోవడంతో పెండింగులో పడ్డాయి. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రావాల్సి ఉంది.



పనులు ఆగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనాలు

జగన్ ఏం చేశారంటే..

అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పట్టించుకోలేదు.ఆ తర్వాత రూ.2500 కోట్ల విలువైన ప్రాజెక్టు పనుల టెండర్లను అర్థంతరంగా రద్దు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పు పేరిట రూ.5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. వీటికీ రెండున్నరేళ్లుగా అనుమతులు ఇవ్వలేదు. రద్దు చేసిన టెండర్ల స్థానంలో ఇంతవరకు రీ టెండర్లూ పిలవలేదు. ఒక్క రూపాయీ ఖర్చు పెట్టలేదు. బాలాజీ రిజర్వాయర్ సైట్ వద్ద కాంట్రాక్టు సంస్థ నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోగా.. వాహనాలన్నీ తుప్పుపట్టిపోయాయి.

ఇదీ ఐదేళ్లలో సీఎం జగన్ సాధించిన 'గాలేరు- నగరి' ప్రాజెక్టు పురోగతి.


నాడు శివాలెత్తి.. నేడు నోరెత్తని వైసీపీ నేతలు

వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. గాలేరు- నగరి ప్రాజెక్టు రెండో దశ పనుల కోసం నగరి ఎమ్మెల్యే రోజా ఆందోళన నడిపారు. ఈ ప్రాజెక్టు వల్ల శ్రీకాళహస్తి నియోజకవర్గానికీ లబ్ధి ఉంది. అందుకని ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు అప్పట్లో వైసీపీ నేత బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆందోళనలు చేపట్టారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కూడా గట్టిగా నినదించారు. తద్వారా 2019 ఎన్నికల్లో ఈ ముగ్గురూ ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో రోజా మంత్రిగాను.. కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్‌గానూ జిల్లాలో బలమైన అధికార కేంద్రంగా మారారు. మధుసూదన్‌రెడ్డి సీఎం జగన్‌కు సన్నిహితులు. ఇక, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఉన్న పలుకుబడి చెప్పక్కర్లేదు. ఇలా ప్రాజెక్టు కోసం నాడు ఆందోళన చేసిన వారు.. మిగతా ప్రజాప్రతినిధులూ ఐదేళ్లుగా నోరు మెదపడంలేదు.

● వర్తమానం

చంద్రగిరి సీను మారింది





వైసీపీ అభ్యర్థికీ సీనియర్ నేతలకూ నడుమ అంతరం
పెరుగుతున్న టీడీపీ గ్రాఫ్
చెవిరెడ్డి దూరమైన లోటు స్పష్టం

చంద్రబాబు స్వస్థలం... చెవిరెడ్డి వైవిధ్య రాజకీయం... వెరసి చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. కానుకలు, సాయాల భారీ ఖర్చుతో నిరంతరం జనం మెప్పుకోసం ప్రయత్నించిన చెవిరెడ్డి అనూహ్యంగా తప్పుకోవడంతో నియోజకవర్గంలో పరిస్థితులు తారుమారు అయ్యాయి. తొలిసారి శాసనసభ బరిలోకి దిగుతున్న తనయుడు మోహిత్‌రెడ్డిని దగ్గరుండి గెలిపించుకునే అవకాశం చెవిరెడ్డి ఒంగోలు ఎంపీగా ఆయన పోటీ చేయాల్సిన అనివార్యతతో కోల్పోయారు. ఈ పరిణామాలన్నీ టీడీపీ అభ్యర్థిగా మరోమారు బరిలోకి దిగుతున్న పులివర్తి నానీకి కలిసివచ్చాయి. ఆయన గ్రాఫ్ విపరీతంగా పెరుగుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీలో పెరిగిపోతున్న అసంతృప్తి

చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. గత ఎన్నికల్లో శక్తికి మించి పనిచేసినా నిరాదరణకు గురయ్యామని వీరు ఆవేదనతో ఉన్నారు. చెవిరెడ్డి నియోజకవర్గంలో ఉన్నంతకాలం దీనిని దాచుకున్న వీరంతా ఇప్పుడు బయటపడుతున్నారు. పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. గత ఐదేళ్లలో పనులు జరగకపోవడం, ఆదాయం లేకపోవడం, గుర్తింపు గానీ, పదవులు గానీ దక్కకపోవడం వంటివి కారణమవుతోంది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నప్పటి నుంచే పట్టు సడలుతూ వచ్చింది. ఎక్కువ కాలం తాడేపల్లిలో వుంటూ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోయారు. మోహిత్‌రెడ్డి వయసు తక్కువ కావడం, తొలిసారి పోటీ చేస్తుండడంతో అతని కంటే వయసులో పెద్దవారు, సీనియర్లు చొరవగా కలవలేకపోతున్నారు. దీంతో అభ్యర్థికీ, సీనియర్ నాయకులూ కార్యకర్తలకూ నడుమ అంతరం పెరిగింది. ఒంగోలుతోనే సతమతం అవుతున్న చెవిరెడ్డి చంద్రగిరిమీద ఇప్పట్లో దృష్టిపెట్టే అవకాశం లేదని తేలిపోయాక పార్టీ నీరసపడింది.

టీడీపీలోకి వలసలు

నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట వైసీపీ నుంచీ పెద్ద ఎత్తున కార్యకర్తలు, గ్రామ స్థాయి నాయకులు టీడీపీలో చేరుతున్నారు. మండల స్థాయిలో ప్రభావం చూపగలిగిన పలువురు నాయకులు వీరిలో ఉండడం విశేషం. చంద్రగిరి మండలం మాజీ జడ్పీటీసీ సరిత భర్త రమణమూర్తి, చంద్రగిరి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి , పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త బాబురెడ్డిలు, చిన్నగొట్టిగల్లులో వైస్ ఎంపీపీ సునీత, భర్త దామోదర్, రామచంద్రాపురం మండల నేత నీలకంఠ చౌదరి తదితరులు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామాలు వైసీపీని గణనీయంగా నష్టపరుస్తున్నాయి.

కాంగ్రెస్‌తో వైసీపీకి నష్టమే!

ఇక చంద్రగిరి నుంచీ ఆర్ఎంపీ వైద్యుడు వాసు కాంగ్రెస్ అభ్యర్థిగా రెండవసారి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత కంచన వేణుగోపాల్‌రెడ్డి కనుక గట్టిగా పనిచేస్తే ఆ మేరకు వైసీపీకి నష్టం కలిగే అవకాశముంది. వేణుగోపాల్‌రెడ్డికి ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో పట్టుంది. ఆయన పట్టుదలగా కాంగ్రెస్ అభ్యర్థి కోసం రంగంలోకి దిగితే ఈ రెండు మండలాల్లో వైసీపీ ఓట్లు గణనీయంగా చీల్చగలరు.

పుంజుకుంటున్న పులివర్తి నాని

టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ, ఆయన సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్... ముగ్గురూ తలోవేపు నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. నానీ గత ఎన్నికల్లో ఓడిపోయాడన్న సానుభూతి జనంలో కనిపిస్తోంది. నిదానంగా టీడీపీ బలం పుంజుకుంటున్న దృశ్యం కనిపిస్తోంది. ఇటీవల ప్రముఖ రియల్టర్ డాలర్స్ దివాకర్‌రెడ్డి కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. నానీని గెలిపిస్తే చంద్రగిరి అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో పలుచోట్ల ప్రకటించారు. మరోవైపు జనసేన, బీజేపీ పార్టీలు తమ పరిధిలో పూర్తి స్థాయిలో టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నాయి. తాజాగా బుధవారం వంగవీటి రాధా చంద్రగిరికి వచ్చి బలిజ సామాజికవర్గంతో సమావేశమై ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశానికి వేలాదిగా బలిజలు హాజరు కావడం చూస్తే ఆ సామాజికవర్గం కూడా గణనీయమైన స్థాయిలో టీడీపీకి మద్దతిస్తున్నట్టు భావించాల్సి వస్తోంది. ఈ అంశాలన్నీ టీడీపీకి సానుకూలతలను పెంచుతున్నాయి.



ఇంటి నుంచే ఓటు

● 32,421మందికి అవకాశం
● దివ్యాంగులు, 85 ఏళ్లు దాటినవారికి పోస్టల్ బ్యాలెట్
● ఫారం-12డీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17: దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇటువంటి వారు జిల్లాలో 32,421మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ఎన్నికల అధికారులకు 12డీ దరఖాస్తు చేసుకుంటే ఈ సౌలభ్యం కల్పిస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 17,94,733 మంది (పురుషులు 8,74,738మంది, మహిళలు 9,19,817మంది) ఓటర్లు ఉన్నారు. వీరిలో.. దివ్యాంగ ఓటర్లు 24,481 మంది, 85 సంవత్సరాలు దాటినవారు 7,940మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులోనూ వందేళ్లు పైబడిన వారు 20మంది ఉన్నారు. వీరికి ఇంటి నుంచే ఓటు వేయడంపై అవగాహన కల్పించడానికి హోం ఓటింగ్ నోడల్ అధికారిగా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లీశ్వరరావును జిల్లా ఎన్నికల అధికారి నియమించారు.

దరఖాస్తు చేయడమిలా..

అర్హులైన దివ్యాంగులు, వృద్ధుల ఇంటికే వెళ్లి ఫారం- 12డీని ఎన్నికల అధికారులు అందజేస్తారు. ఈ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్వోలకు ఇస్తే.. వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాకే అర్హులైన ఓటర్ల ఇంటికి పోస్టల్ బ్యాలెట్‌ను పంపుతారు. వీరిలో ఎవరైనా తాము పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తామని చెబితే ఫారం-12డీ ఇవ్వరు.

రహస్య పద్ధతిలోనే ఓటింగ్

ఓటర్ల నివాసానికి ఎన్నికల సిబ్బంది వ్యాన్‌లో చేరుకుంటారు. ఇద్దరు పోలింగ్ అధికారులు, ఓ వీడియోగ్రాఫర్, పోలీస్‌శాఖ నుంచి ఒకరుంటారు. అక్కడ ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో రహస్యంగా ఓటు వేసి, దాన్ని బ్యాలెట్‌బాక్సులో ఓటరు వేసేలా చర్యలు తీసుకుంటారు. ఎవరికి ఓటు వేశారన్న విషయాన్ని తప్ప, మిగిలిన ప్రక్రియనంతా అధికారులు చిత్రీకరిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చిత్తూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొద్ది మొత్తం నగదు తీసుకుని వెళ్లాలన్నా జనం జంకుతున్నారు. బిల్లులు, ఆధారాలు చూపకుంటే ఇంతేసంగతులు. అధికారులు సీజ్ చేసేస్తున్నారు. 2014, 2019 ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి విపరీతమైన నిఘా పెరిగింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 233 కేసులు నమోదు చేసి రూ.1.60 కోట్లు స్వాధీనం చేసుకున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత రెండు ఎన్నికలతో పోల్చుకుంటే కేసుల సంఖ్య పెరిగింది. కోడ్ నేపథ్యంలో డబ్బుతో పాటు మద్యం, బంగారం వంటి ఇతర సామగ్రిని కూడా రికార్డులు లేకుంటే స్వాధీనం చేసుకుంటున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళితే ఆధారాలు చూపించాల్సి ఉంది. రూ.రెండు లక్షలకు మించితే ఎన్నికల విభాగంలోని రెవెన్యూ, పోలీసు అధికారులు లోతుగా పరిశీలిస్తారు. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉంటే జిల్లా ఎన్నికల అధికారులు నియమించే కమిటీ ముందుకు వెళ్తుంది. కమిటీ ఎదుట యజమాని హాజరై సరైన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై కమిటీ సంతృప్తి చెందితే నగదు అప్పగిస్తుంది. లేకుంటే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రూ.10 లక్షలకు మించి స్వాధీనం చేసుకుంటే ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఆ నగదు సీజ్ చేసిన అధికారులు బాధ్యులకు నోటీసులు జారీ చేస్తారు. వారిచ్చే సమాధానాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

ఆధారం లేకుంటే గుండె గు'బిల్లు'

- ఎన్నికల వేళ పట్టుబడుతున్న నగదు
- ఇప్పటివరకు రూ.1.60 కోట్లు స్వాధీనం



గత ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ

నగదు మాత్రమే కాదు. గడియారాలు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు వంటి వాటితో పాటు కుక్కర్లు, క్రికెట్ కిట్లు వంటి బహుమానాల విలువ రూ.10 వేలకు మించితే పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. వ్యాపార నిమిత్తమైతే రికార్డులు చూపిస్తే తిరిగి అప్పగిస్తారు. లేకుంటే సీజ్ చేస్తారు. ఓటర్ల ప్రలోభానికని ఆధారాలు లభిస్తే కేసు నమోదు చేస్తారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తారు. 2014 ఎన్నికల్లో 66 కేసులు, 2019లో 116 కేసులు నమోదయ్యాయి. ఈసారి స్వల్ప వ్యవధిలోనే 223 కేసులు పెట్టారు. పోలింగ్ నాటికి ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

గత ఎన్నికల్లో నమోదైన కేసుల వివరాలు	సంవత్సరం	పట్టుబడిన నగదు	మద్యం, బంగారం, డ్రగ్స్ వంటివి	మొత్తం విలువ	నమోదుచేసిన కేసులు
	2014	రూ.11 లక్షలు	రూ.13 లక్షలు	రూ.23 లక్షలు	66
	2019	రూ.5 లక్షలు	రూ.రూ.6.33 కోట్లు	రూ.6.38 కోట్లు	116
	2024 (ఇప్పటివరకు)	రూ.1.19 కోట్లు	రూ.41 లక్షలు	రూ.1.60 కోట్లు	223

- 2014లో రూ.10 లక్షలు, 2019లో రూ.2 కోట్లు, ఈసారి రూ.20 లక్షలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- 2014లో డగ్స్, మత్తు పదార్థాలు వంటివి లభించలేదు. 2019లో రూ.6 లక్షలు, తాజాగా రూ.4 లక్షలు విలువ చేసేవి పట్టుకున్నారు.
- 2019లో 12657 గ్రాముల బంగారం, 60 డైమండ్స్, 43970 గ్రాముల సిల్వర్, స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4.17 కోట్లు. తాజాగా రూ.14 లక్షలు విలువ చేసే 14 కిలోల రోల్డ్ గోల్డ్, 14.8 కిలోల సిల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- 2014లో రూ.2లక్షలు, 2019లో రూ.9 లక్షలు, ఇప్పుడు రూ.3 లక్షలు విలువ చేసే బహుమతుల్ని స్వాధీనపరచుకున్నారు.
- కోడ్ అమల్లోకి రాకముందు మార్చి 5న నగరి మండలం తడుకుపేట చెక్‌పోస్టు వద్ద రూ.3.98 కోట్ల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోజాకు.. ఎదురుగాలి!

● అసమ్మతి, అసంతృప్తితో ఉక్కిరిబిక్కిరి ● ప్రభుత్వ వ్యతిరేకతకు తోడైన స్వపక్షీయుల కాక ● మరోపక్క చేరికల సమరోత్సాహంతో టీడీపీ

రెండుసార్లు స్వల్ప తేడాతో ఓటమితో ఉన్న టీడీపీలో గెలవాలన్న కసి కనపడుతోంది. ఆ దిశగా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మరోవైపు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రోజా.. అసంతృప్తి, అసమ్మతులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి ప్రభుత్వ వ్యతిరేకతా తోడవడంతో నియోజకవర్గంలో వైసీపీకి ఎదురు'గాలి' వీస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు.

- పుత్తూరు అర్బన్/ నగరి

గత ఎన్నికల్లో ఉన్న ఉత్సాహం వైసీపీ శ్రేణుల్లో ఈదఫా కనిపించడం లేదనే మాటలు వినబడుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో బొటాబొటీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన రాష్ట్ర మంత్రి రోజా హ్యాట్రిక్ కోసం ఆశలు పెట్టుకున్నారు. అయితే రెండుసార్లు పోరాడి ఆమెను గెలిపించిన కీలక నాయకులు ఈసారి ముఖం చాటేస్తున్నారు. ఆమెకు వైసీపీ అభ్యర్థిత్వం దక్కకుండా అధిష్ఠానం వద్ద తుదివరకు పోరాటం



చేసిన అసమ్మతి నాయకులు ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నా.. రోజాకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో మొదలియార్ ఓటర్లను ప్రభావితంచేసే వైసీపీ నాయకుడు ఏలుమలై మొదలియార్ (అమ్ములు), వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, క్షత్రియ సామాజికవర్గంలో పట్టున్న విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు, పుత్తూరుకు చెందిన రవిశేఖర్‌రాజు, నింద్ర మండలం కొప్పేడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డివారి భాస్కర్‌రెడ్డి తదితరులు రోజాపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారాన్ని కుటుంబసభ్యుల నెత్తిన పెట్టిన మంత్రి రోజా అలకలు తీర్చడం, బుజ్జగింపులు, సర్దుబాట్లతో బిజీగా గడిపేస్తున్నట్లు తెలుస్తోంది.

దూకుడు మీదున్న టీడీపీ

మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ప్రచార పర్వంలో దూసుకెళుతున్నారు. ఏడాదిగా ఆయన వివిధ కార్యక్రమాలతో ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. 'మీతో మీ తెలుగుదేశం', 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పుత్తూరులో ఇటీవల అధినేత చంద్రబాబునాయుడు పాల్గొన్న ప్రజాగళం సభ అంచనాలకు మించి సూపర్ సక్సెస్ కావడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగింది. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి చేరే వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండడం అనుకూల అంశంగా మారుతోంది. వైసీపీకి పట్టున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలను తనవైపు తిప్పుకోవడంలో గాలి భానుప్రకాష్ సఫలమయ్యారు. నామినేషన్ల పర్వం జోరందుకునే క్రమంలో వైసీపీ నుంచి కీలక నాయకుల చేరికలకు భానుప్రకాష్ స్కెచ్ వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



పెరిగిన వలసలు

గత రెండు ఎన్నికల్లో వైసీపీ గెలవడానికి ప్రధాన కారణమైన వడమాలపేట మండలంలో టీడీపీ అనూహ్యంగా పుంజుకొంది. టీసీ అగ్రహారం, తట్నేరి, కాయం పంచాయతీల్లో వైసీపీ నుంచి కీలక నాయకులు టీడీపీలో చేరారు. యాదవ సామాజికవర్గంలో పట్టున్న ఎస్‌బీఆర్ పురానికి చెందిన మాజీ సర్పంచ్ గెడ్డం సుబ్రమణ్యం యాదవ్, విజయపురం మండలంలో జగన్నాథపురం, కోసలనగరం, పాతార్కాడు పంచాయతీలకు చెందిన సోమశేఖర్, మునికృష్ణ, సర్పంచ్ నారాయణరాజు, పుత్తూరు మున్సిపాలిటీ తొలి చైర్మన్, దళితనాయకుడు అంకయ్య, అదే సామాజికవర్గానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు భువనేశ్వరి, జాన్ కెనడీ, అంబేడ్కర్ ట్రస్ట్ భవనం కోశాధికారి, రిటైర్డ్ టీచర్ కుప్పయ్య, బలిజ సంఘం పూర్వ అధ్యక్షుడు, శివాలయం మాజీ చైర్మన్ జలకం సునీల్ కుమార్, నగరికి చెందిన వైసీపీ నాయకుడు కేజే కుమార్ ముఖ్య అనుచరులైన శ్రీనివాసన్, నెడుంజయ్, దేశమ్మ దేవాలయం మాజీ చైర్మన్ బాబురెడ్డి, తడుకుపేటకు చెందిన మోహన్‌రావు తదితర నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వైసీపీలో కాంగ్రెస్ కలవరం



మరోవైపు కాంగ్రెస్ కూడా రేసులోకి వస్తోంది. ఆ పార్టీ తరపున పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నగరి, పుత్తూరులో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సభలను విజయవంతం చేయడంతో ఈ దఫా కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పరిణామం కూడా వైసీపీ క్యాంపులో ఆందోళన కలిగిస్తోంది. నామినేషన్ల పర్వంతో నగరి రాజకీయం హాట్‌హాట్‌గా మారనుంది.

● కోడ్ ఉల్లంఘన

డీఈవో కార్యాలయం ముందు 'సిద్ధం'



ఎన్నికల కోడ్ ఉంటే మాకేంటి? నిబంధనలు ఉల్లంఘిస్తే మమ్మల్ని అడిగేదెవరని వైసీపీ నేతలు అనుకున్నారేమో? ప్రభుత్వ కార్యాలయాల ముందు ఎటువంటి రాజకీయ ప్రచార బ్యానర్లు పెడుతున్నారు. చిత్తూరులోని ఎమ్మెస్సార్ సర్కిల్ సమీపంలోని డీఈవో కార్యాలయం ముందు సీఎం జగన్ ఫొటోతో ఉన్న సిద్ధం బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని అధికారులూ పట్టించుకోకపోవడం స్థానికుల నుంచి తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- చిత్తూరు సిటీ

ఆయనొస్తానంటే.. మేము వద్దంటాం

ఆయన 90వ దశకంలో టీడీపీ నేతగా రామకుప్పం మండలంలో ఒక వెలుగు వెలిగారు. ఎంపీపీగా, జడ్పీటీసీగా పనిచేశారు. నియోజకవర్గ నేతలపై కినుక వహించి 2010-14 మధ్య స్తబ్దుగా ఉండిపోయారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిశారు. 2014 ఎన్నికల్లో తాను సీఎం కాగానే రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇస్తానంటూ పార్టీ అధినేత హామీ కూడా ఇచ్చారట. ఏమైందో ఏమో గానీ, కొంతకాలానికే ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ సామాజిక వర్గ నేతగా 2014, 2019 ఎన్నికల్లో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో వైసీపీ తరపున ప్రచారం చేశారు. 2014లో వైసీపీ అధికారంలోకి రాకపోయినా ఆ పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారు. 2019లో అధికారంలోకి రావడంతో తనకు ప్రాధాన్యం గల నామినేటెడ్ పదవి వస్తుందని, ఈ మేరకు పార్టీలోని పెద్ద నేతలు హామీ ఇచ్చారని అందరికీ చెప్పుకొన్నారు. ఐదేళ్ల వరకు నిరీక్షించినా.. పదవి రాలేదు. ఈ బాధ ఒకవైపు.. వైసీపీ పాలనపట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో ఈసారి టీడీపీ అధికారంలోకి వస్తుందన్న భావనతో ఆ పార్టీ తలుపులు తట్టారు. నియోజకవర్గ కార్యాలయానికి వెళ్లి.. తాను సొంతగూటికి వస్తానని చెప్పారట. ఈయన రావడం వల్ల లాభంకన్నా.. నష్టమే ఎక్కువంటూ టీడీపీ నేతలు, సొంత పంచాయతీ శ్రేణులు పార్టీ అధిష్ఠానానికి తెలిపారు. పార్టీలోకి చేర్చుకోవద్దంటూ కుండబద్దలు కొట్టడంతో ఆయన చేరిక ఆగింది. టీడీపీలో చేరేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు తెలియడంతో వైసీపీ నేతలూ ఆయన్ను పట్టించుకోవడం మానేశారు. ఈ క్రమంలో ఆయన రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందో?

- రామకుప్పం

- షర్మిల సభలతో వైసీపీలో ఆందోళన
- 4 నియోజకవర్గాల్లో బలమైన ప్రభావం
- వైసీపీ ఓట్లను పెద్దఎత్తున చీల్చే అవకాశం

ఆ నలుగురూ...



జిల్లాలో వైసీపీకి కొత్త భయం పట్టుకుంది. ఇప్పటికే టీడీపీ, జనసేన,బీజేపీ కూటమిగా ఏర్పడి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంటే తాజాగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటనకు లభించిన ఆదరణ చూసి అధికార పార్టీ నేతలు తల పట్టుకుంటున్నారు. తమకు పడాల్సిన ఓట్లు కాస్తా కాంగ్రెస్ అభ్యర్థులకు మళ్లిపోతాయని కలవరపడుతున్నారు. ఏపీ న్యాయ్ యాత్ర పేరుతో ఆమె ఇటీవల పుత్తూరు, కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం పట్టణాల్లో రోడ్ షో నిర్వహించారు. ఊహించని రీతిలో ఆమెకు జనాదరణ దక్కింది. షర్మిల సూటిగా సంధించిన విమర్శనాస్త్రాలకు స్పందన లభించింది. దీంతో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఓట్లలో కోత పడినట్టేనా..

వైఎస్సార్ బిడ్డ షర్మిల.. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయడం జిల్లా వైసీపీకి నష్టం కలిగించే అంశమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రతి వేదిక మీదా ఆమె ప్రభుత్వ, జగన్ వైఫల్యాలను గట్టిగా ఎండగట్టారు. హామీల అమలు మరచిన తీరునూ గుర్తు చేశారు. నగరి, పూతలపట్టు, పలమనేరు, జీడీనెల్లూరు కాంగ్రెస్ అభ్యర్థులు రాకేష్‌రెడ్డి, ఎంఎస్ బాబు, శివశంకర్, రమేష్‌బాబు తమ నియోజకవర్గాల్లో కొంత ప్రభావితం చేయగలిగినవారే. పూతలపట్టు నియోజకవర్గంలో ఎంఎస్ బాబు సిటింగ్ ఎమ్మెల్యేగా తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కచ్చితంగా పెద్దఎత్తున వైసీపీ ఓట్లను చీల్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇప్పటికీ బంగారుపాళ్యం మండలంలోని పలువురు మైనార్టీలు కాంగ్రెస్‌లో చేరారు. జీడీ నెల్లూరులో కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ బాబు గత ఎన్నికల్లో మేనమామ, డిప్యూటీ సీఎం నారాయణస్వామి గెలుపు కోసం శ్రమించారు. నియోజకవర్గంలో పరిచయాలు, పట్టున్న నాయకుడు. నారాయణస్వామి వ్యతిరేక వర్గాన్ని తనవైపు మళ్లించుకుని వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిని ఇరకాటంలో పడేస్తారని భావిస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలో శివశంకర్ ప్రతి మండలంలోనూ తన టీమ్ ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేసుకుంటున్నారు. ఈ ముగ్గురూ డబ్బును కూడా ఖర్చు చేసి వైసీపీ అభ్యర్థుల ఓటమికి పని చేసేందుకు సమాయత్తమవుతున్నారు. నగరి కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్. ఈయన తండ్రి ప్రభాకర్‌రెడ్డి సీనియర్ కాంగ్రెస్ లీడర్. మాజీ మంత్రి చెంగారెడ్డి అనుచరులు కూడా. పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2019 ఎన్నికల్లో జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థులలో రాకేష్‌రెడ్డికే ఎక్కువగా (3357) ఓట్లు పోలయ్యాయి. ఈసారి కూడా వైసీపీ ఓట్లను చీల్చే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల్లోపు షర్మిల మరోసారి మిగిలిన నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తారనే సమాచారంతో వైసీపీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ మందు

ఇంత బతుకూ బతికి!



ఇటీవల ఒక ధర్నా సందర్భంలో భరత్ పక్కనే ఒదిగి కూచున్న సుబ్రమణ్యంరెడ్డి (ఫైల్ ఫొటో)

అయ్యయ్యో.. ఇట్టా అయిపోయిందేందప్పా ఈయప్ప పరిస్థితి అని కుప్పం వైసీపీ ప్రచారాల్లో ఆయనను చూసిన వారంతా విచారపడుతూ ఉన్నారు. ఎం.సుబ్రమణ్యంరెడ్డి ఒకప్పుడు వైఎస్సార్ హయాంలో చిత్తూరు జడ్పీ చైర్మన్‌గా చేశారు. అదేమన్నా అల్లాటప్పా పదవా.. జిల్లాకే పెద్ద పదవి. 1999, 2004, 2009 ఎన్నికల్లో కుప్పంలో ఏకంగా చంద్రబాబు పైనే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఓడిపోయినా చంద్రబాబును సవాలు చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉండేది. ఆ తర్వాత ఆయన వైసీపీలో చేరారు. తండ్రి వైఎస్ లాగే కొడుకూ 2014లో తనకే టికెట్ ఇస్తాడని ఆశపడ్డారు. భంగపడ్డారు. రాజకీయ వైరాగ్యంతో అలికిడి లేకుండా ఉండిపోయిన ఆయన 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. పీకేఎం ఉడా (పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ) చైర్మన్‌గా ఎన్నికల ముందు ఓ రెండుమూడు నెలలు వెలిగారు. చంద్రబాబు గెలుపుకోసం ప్రచారమూ కాస్తంత ఉధృతంగానే చేశారు. కానీ దురదృష్టం వెన్నాడింది. టీడీపీ ప్రతిపక్షంలో కూచుంది. మళ్లీ రెడ్డిగారు వైరాగ్యంతో తిరుపతి చెక్కేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాయి కదా. జగన్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఆయన చేతులమీదుగా వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే వైసీపీలో ఆయనకంటూ ప్రత్యేక స్థానం లేనట్టుంది. ప్రచారాల్లో ఇప్పుడు ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి తిరుగుతూ, ఆయన పక్కనో, లేదా వెనుకనో ఒదిగిపోయి ఫోటోల్లో కనిపిస్తున్నారు. వైసీపీ టికెట్ కోసం ఒకప్పుడు భరత్ తండ్రి చంద్రమౌళితో పోటీపడి నిరసన సభలు, సమావేశాలు సైతం నిర్వహించి సవాలు చేసిన సుబ్రమణ్యంరెడ్డికి ఇప్పుడీ స్థితి ఏమిటా అని జనం అనుకుంటున్నారు.

- కుప్పం

అమ్మో.. బులుగు బ్యాచ్





బుధవారం.. టీడీపీ కండువా కప్పుకొంటూ -వారం కిందట వైసీపీ నేతలు కప్పిన కండువాతో మల్లికార్జున

కనపడితే చాలు.. వైసీపీ కండువా వేసేస్తున్నారు. ఇలా కండువా కప్పుకొన్న వాళ్లంతా లబోదిబోమంటున్నారు. ఇలా చౌడేపల్లె మండలం బత్తలాపురరంలో వారం కిందట ఇంటింటి ప్రచారానికి వచ్చిన వైసీపీ నేతలు తనకు కండువా కప్పారని మల్లికార్జున బుధవారం వాపోయారు. తాను 30 ఏళ్లుగా టీడీపీలో ఉన్నానని, ఇంకా కొనసాగతానని చెప్పారు. అందుకనే రాజంపేట టీడీపీ నేత వెంకటరమణ చేతుల మీదుగా మళ్లీ టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు చెప్పారు. ఇటీవల శాంతిపురం మండలంలోనూ మీటింగుకని పిలిచి ఓ మహిళకు వైసీపీ కండువా కప్పారు. ఈ పరిణామంపై ఆమె రోదిస్తూ.. మళ్లీ టీడీపీలో చేరారు. ఈనెల 11న వ్యవసాయ పనులకు వెళుతున్న తమకు వైసీపీ వారు కండువా కప్పారంటూ పలమనేరు మండలం కురప్పల్లికి చెందిన ఆవేదన వ్యక్తంచేశారు. మరునటి రోజు వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఈ పరిణామాలను చూసి 'అమ్మో.. బులుగు బ్యాచ్' అంటూ జనం హడలిపోతున్నారు.

- పుంగనూరు/చౌడేపల్లె

హనుమంతరాయ.. ఆదుకోవయ్యా!



● సెంటిమెంట్

పుంగనూరు నియోజకవర్గంలోని రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారాలు, నామినేషన్ల దాఖలు సమయాల్లో ముందుగా హనుమంతురాయదిన్నె ప్రసన్న ఆంజనేయస్వామి అనుగ్రహం కోసం పూజలు చేసి కార్యక్రమాలు మొదలు పెట్టడం సెంటిమెంట్‌గా మారింది. పుంగనూరు నుంచి రామసముద్రం వెళ్లే మార్గంలో శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో ఈ ఆలయం ఉంది. పుంగనూరుకు దేవమూల(రాశిమూల), నైరుతిలో ఆలయం ఉండడమే ఈ సెంటిమెంట్‌కి కారణం. నామినేషన్ దాఖలు సమయాల్లో ఆలయంలో పూజలు చేసి ర్యాలీగా వెళ్లి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారు. ఇప్పటికే చల్లా రామచంద్రారెడ్డి (టీడీపీ), పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైసీపీ), బోడే రామచంద్ర యాదవ్(భారత చైతన్య యువజన పార్టీ)లు ఆంజనేయస్వామికి పూజలు చేసి ఎన్నికల ప్రచారాలు ప్రారంభించారు.

- పుంగనూరు

ఆదరిస్తే ఇంటి బిడ్డగా పనిచేస్తా

టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ


పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారంలో లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 17: ఆదరించి అసెంబ్లీకి పంపిస్తే ఇంటి బిడ్డగా అందుబాటులో ఉంటానని వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. బుధవారం ఆమె పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వాతాతలకు రూ.4 వేలు పింఛను ఇంటికే తీసుకొచ్చి అందిస్తారన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా ప్రజలు సమస్యలు ఏకరవు పెడుతున్నారని, ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పాతరేసిందనడానికి నిదర్శనమన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్టు గుర్తించానని, అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తానన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకులు పి.రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, సత్యనారాయణ, శ్రీరాందాస్ గంగాధర్, శ్రీనివాసులు నాయుడు, రామచంద్రయ్యబాబు, చెంచయ్య, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు

దుర్మార్గ పాలకులను గద్దె దించుదాం


కరపత్రాల పంపిణీలో పాశం సునీల్‌కుమార్, సంధ్యారాణి

గూడూరు, ఏప్రిల్ 17: రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దింపుదామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో ఆయన తన భార్య సంధ్యారాణితో కలిసి సూపర్-6 పథకాలపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడమే పనిగా పాలన సాగించిందన్నారు. జగన్‌కు దోచుకోవడమే తెలుసన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు సంపదను సృష్టించడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తారన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించగల సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, పరమేశ్వర్‌గౌడ్, తాళ్ల సుబ్బమ్మ, శ్రీదేవి, లక్ష్మణ్‌రావు, హరిబాబు, శంకర్, కేశవ, సరస్వతమ్మ, పర్వీన్, సుమతి, ఔరంగ్‌బాషా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సైకో జగన్‌ను తరిమికొడదాం


వైసీపీ నుంచి పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న పాశం

కోట, ఏప్రిల్ 17: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సైకో సీఎం జగన్‌ను ఓటు అనే ఆయుధంతో తరిమికొడదామని గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో 300 కుటుంబాలు వైసీపీ నుంచి బుధవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఆయా నాయకులను పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గూడలి పంచాయతీ నుంచి నాయకులు రాజ్‌కిషోర్, ఆశం జనార్దన్ ఆధ్వర్యంలో, తిన్నెలపూడి నుంచి సుష్మారెడ్డి, వెంకన్నపాళెం నుంచి మధుయాదవ్, కోట నుంచి పలువురు నేతల ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 300 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ మరో కొద్ది రోజుల్లో రాక్షసపాలన పోయి రామరాజ్యం వస్తుందన్నారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావుతో కలసి గోవిందపల్లిపాళెంలోని మత్స్యకార కుటుంబాల నేతలతో సమావేశమయ్యారు. పులికాట్, సముద్ర ముఖద్వారాలను పూడిక తీస్తామని వరప్రసాదరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, దశరథరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మస్తాన్‌బాషా, అనిల్, మోహన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎన్డీయే అభ్యర్థులను గెలిపించుకుందాం

ఎమ్మార్పీఎస్


దిశానిర్దేశం చేస్తున్న పెంచలయ్య

నాయుడుపేట, ఏప్రిల్ 17 : ఎన్డీయే కూటమి తిరుపతి పార్లమెంట్ ఎంపీ బీజేపీ అభ్యర్థి వరప్రసాదరావు, సూళ్లూరుపేట నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మందా పెంచలయ్య పిలుపునిచ్చారు. నాయుడు పేట గణేశ్ రెసిడెన్సీలో బుధవారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవు తుందన్నారు. ఈనెల 19వ తేదీ తిరుపతి పార్లమెంట్ సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.గోవిందవాసు, సురేష్, విజయలక్ష్మి, సిసింద్రి, మస్తాన్, రాజ్‌కుమార్, నరసింహ పాల్గొన్నారు.

టీడీపీ విజయం చారిత్రక అవసరం

వైసీపీతో రాష్ట్రం తిరోగమనం: మాజీ మంత్రి పరసా


కొండవల్లిపాడులో ప్రసంగిస్తున్న పరసారత్నం

ఓజిలి, ఏప్రిల్ 17 : తెలుగుదేశం పార్టీ విజయం చారిత్రక అవసరమని వైసీపీ అరాచక పాలనతో తిరోగమనంలో పయనిస్తున్న రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. ఓజిలి మండలం కొండవల్లిపాడు పంచాయతీలో బుధవారం టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. దోపిడీ, దాడులు, కక్షసాధింపు చర్యలు తప్ప వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిందేమి లేదన్నారు. మండల టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి పాదర్తి ప్రకాష్‌నాయుడు, నాయకులు శ్రీనివాసలు శెట్టి, దనుంజయరెడ్డి, నెలవల రాజేష్ తదితరులుపాల్గొన్నారు.

పింఛన్ నేరుగా ఇంటికే పంపుతాం

తడ: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 4వేల పింఛన్‌ను నేరుగా ఇంటికే తెచ్చి ఇస్తామని మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని కాదలూరు, వెండ్లూరుపాడుల్లో టీడీపీ అభ్యర్థిని విజయశ్రీతో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.200 ఉన్న పింఛనును రూ.2వేలు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, వి.సతీష్‌రెడ్డి, కె.మురళీరెడ్డి, బి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనవమి మహోత్సవాలు





నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురం ఆలయ ప్రత్యేక పూజల్లో టీడీపీ నాయకులు - వెంకటగిరి పట్టణంలోని రాములవారి గుడిలో సీతారాముల కల్యాణం - గూడురు పట్టణంలోని సాయిబాబా మందిరంలో సీతారాముల కల్యాణం - బంగారుపేట రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 17: పట్టణంలోని అన్ని రామమందిరాల్లో రామనవమి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజగోపాలపురంలో కొలువై ఉన్న లక్ష్మణ సమేత సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలకు టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అలాగే బజారువీధి, అగ్రహారపేట, తుమ్మూ రులలో ఉన్న రామ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెళ్లకూరు: మండలంలో రామనవమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. జీలపాటూరు రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణుడు పాలూరు మహేంద్రరెడ్డి ఆయన భార్య ప్రముఖ గర్భకోశ వ్యాధి నిపుణురాలు కట్టంరెడ్డి తనూజ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదేవిధంగా పెళ్లకూరు, కొత్తూరు, టెంకాయతోపు, చెంబేడు, చెన్నప్పనాయుడుపేట తదితర గ్రామాల్లో శ్రీరా మనవమి వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాలోని రామాలయాలను మామిడితోరణాలతో, పలు రకాల పూలతో, చలువపందిళ్లతో, విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు.ఆయా వేడుకల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో నవమి వసంతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం రాములోరి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆలయ చుట్టూ ఊరేగించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. విశేషాలంకరణతో పెళ్లిపీటలపై ఆసీనులైన స్వామిఅమ్మవార్లకు వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కల్యాణతంతు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా రామనామస్మరణలతో మార్మోగింది. బ్రాహ్మణవీధిలో ఉన్న సీతారాముల ఆలయం, పార్కువీధిలోని మద్వేంకటరామ్మూర్తిస్వామి ఆలయాల్లో కూడా నవమి వేడుకలను పురస్కరించుకొని సీతారాముల కల్యాణం నిర్వహించారు.

తడ: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని బోడిలింగాలపాడులో ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహిచారు. నిప్పో పరిశ్రమ ఎండీ పి.ద్వారకనాథరెడ్డి దంపతులు ఉయభకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: రామ నవమి పురస్కరించుకుని పట్టణంల్లోని అన్ని రామాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు.

గూడూరు అర్బన్: నవమి సందర్భంగా పట్టణంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శిరిడిసాయిబాబా మందిరంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరిపారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆయలం, వేంకటేశ్వరస్వామి గుడి సమీపంలోని రామాలయం తదితర ఆలయల్లో నవమి వేడుకలు వైభవంగా జరిగాయి.

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేటలో ఉన్న శ్రీరాముడి ఆలయంలో నవమి వేడుకల్లో టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆమె తీర్థప్రసాదాలు అందించారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని రాముడిని వేడుకున్న ఆమె నియోజకవర్గ ప్రజలకు నవమి శుభాకాంక్షలు తెలిపారు.

చిల్లకూరు: మండలంలో రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం జరిపారు. అన్నదానం నిర్వహించారు. రాత్రి స్వామివారికి గజ వాహనసేవ జరిపారు.

బాలాయపల్లె: శ్రీరామ నవమి వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మన్నూరులో నవమి సందర్భంగా అన్నదానం జరిగింది. బాలాయపల్లెలో రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు.

కోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల రామాలయాల్లో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోవిందపల్లిపాళెం, మత్స్యకార గ్రామంలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి చర్యలు: చింతామోహన్


కోట పట్టణంలో ప్రచారం చేస్తున్న చింతామోహన్

గూడూరు, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి చర్యలు చేపడుతామని తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. బుధవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గూడూరు నియోజకవర్గాన్ని మహా నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. రైతులకు రుణమాఫీ, అర్హులైన వారికి సంక్షేమపథకాలు అందిస్తామన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమయ్య తదితరులు పాల్గొన్నారు.


సూళ్లూరుపేట: కేంద్రలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతామోహన్ అన్నారు. బుధవారం ఆలయన సూళ్లూరుపేటలో కాంగ్రెస్ అభ్యర్థి తిలక్‌బాబుతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుతో బీజేపీ పతనం ప్రారంభమయ్యిందన్నారు. ఆ పార్టీకి 150 సీట్లకు మించి రావడం కష్టమన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు, ప్రతిపక్ష నాయకులపై మోదీ అక్రమ కేసుల పెట్టి అధికారంలోకి రావాలను కోవడం మంచి పద్ధతి కాదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దవడమే కాకుండా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేసి తన సొంత రాజ్యాంగాన్ని మోదీ అమలు చేస్తారన్నారు.ఈశ్వరయ్య, చందనముడి శివ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్, దళితవాడల్లో బుధవారం చింతామోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఉపకారవేతనాలను గణనీయంగా పెంచుతామన్నారు. ప్రతి పేదవాడు పక్కా గృహం నిర్మించుకునేందుకు రూ.5లక్షలను అందిస్తామన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.94 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.94 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించగా, రూ.2.94 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 67,294 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,765 మంది తలనీలాలు సమర్పించారు.

శేషాచల అడవుల్లో కొనసాగుతున్న మంటలు



తిరుమల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో మంటలు వ్యాపిస్తూనే ఉన్నాయి. తిరుమలలో దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం, మొదటి ఘాట్‌కు సమీపంలోని సానరాళ్ల బండ ప్రాంతంలో మంగళవారం అడవికి నిప్పు అంటుకున్న విషయం తెలిసిందే. దట్టమైన అడవి కావడంతో టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ సిబ్బంది మంటలను ఎంత అదుపుచేసే ప్రయత్నం చేసినా సాధ్యం కావడం లేదు. ఈ క్రమంలో బుధవారం కూడా మంటలు క్రమంగా వ్యాప్తిచెందుతూనే ఉన్నాయి. అయితే ఘాట్‌వైపుగా మంటలు రాకుండా అటవీశాఖ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ కాంటూర్స్ ఏర్పాటు చేయడంతో మంటలు రోడ్డువైపునకు రావనే అంచనా వేస్తున్నారు. మరోవైపు దర్శనం ముగించుకుని వాహనాల్లో వెళుతున్న భక్తులు దూరంలో మండుతున్న అడవిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు.

రామ మందిర నిర్మాణానికి కృషి



వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17: పట్టణంలోని ఏపీటీఎఫ్ కాలనీలోని రామ మందిరం నిర్మాణానికి స్వామి వివేకానంద యువసైన్యం నిర్వహకుడు ప్రకృతికుమార్ తన వంతు సాయం చేశారు. దశాబ్దకాలంగా మందిర నిర్మాణానికి వస్తున్న అడ్డంకుల తొలగాయన్నారు. బుధవారం శ్రీరామ నవమి రోజున నిర్మాణం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గోపీనాథ్, కోటేశ్వరరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు



నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 17: పట్టణంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా కవాతు నిర్వహించాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో కవాతు నిర్వహించినట్టు ఎస్‌ఐ గోపి తెలిపారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి, ఏప్రిల్ 17 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో ఆఫీలో నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభ కానుండడంతో ఆప్రాంతంలో శాంతి భద్రత చర్యలకు పోలీసులు ఉపక్రమించారు. ఈ మేరకు బుధవారం ఆ ఏర్పాట్లును శ్రీసిటీ డీఎస్పీ, నామినేషన్ల నోడల్ అధికారి పైడేశ్వరరావు, వెంకటగిరి సిఐ సంగమేశ్వరరావులు పర్యవేక్షించి సిబ్బందికి ఏర్పాట్లుపై తగు సూచనలు చేశారు. ఈ ప్రాంతలో 144 సెక్షన్ అమలులో వున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంశనీయ సవంఘటనలు జరగకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

21న నేత్ర వైద్య శిబిరం

నాయుడుపేట, ఏప్రిల్ 17: పట్టణంలోని స్వర్ణముఖినది పరీవాహక ప్రాంతంలోని మల్లికార్జున ఆశ్రమంలో 21వ తేదీ ఆదివారం నేత్ర వైద్య ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్ తెలిపారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా బస్టాండ్ వెలుపల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జి.సుధీర్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు రామనారాయణ, తులసీరామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



పోలయ్య మృతదేహం

తడ, ఏప్రిల్ 17: మండలంలోని బోడిలింగాల పాడులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిప్పో కంపెనీలో వంట మాస్టర్ ఎల్లా పోలయ్య (44) మృతి చెందాడు. తనతో పనిచేసే చైతన్యతో కలిసి సూళ్లూరుపేటకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా బోడిలింగాలపాడు శివాలయం వద్ద దిగుతుండగా అదే దారిలో తడకు వెళ్తున్న లగేజీ ఆటో ఢీకొనింది. ఈ ప్రమాదంలో పోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. చైతన్య గాయపడ్డాడు. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సూళ్లూరుపేటకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దూకి క్యాన్సర్ రోగి ఆత్మహత్య

కోట, ఏప్రిల్ 17: మండలంలోని చంద్రశేఖరపురంలో బుధవారం తెల్లవారుజామున కోటయ్య (38) అనే వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు కోటయ్య గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండేవాడు. ఈక్రమంలో వ్యాధి నయం కాక పోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోటయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అదే విధంగా కొండుగుంట వద్ద ఆటో బోల్తాపడిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు బుధవారం తెలిపారు. సునీల్ అనే డ్రైవర్ పలువురు మహిళలను ఆటోలో గూడూరుకు వెళ్తుండగా కొండుగుంట వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఓ మహిళకు చెయ్యి విరిగి నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు: డీఎస్పీ



గూడూరు, ఏప్రిల్ 17: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సూర్య నారాయణరెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని భద్రాతా చర్యలు చేపట్టామన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు వారి రూట్ మ్యాప్‌ను తెలియజేయడంతోపాటు ర్యాలీకి అనుమతి తీసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ర్యాలీలను నిలిపివేయాలన్నారు. నామినేషన్ కేంద్రంలోకి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ప్రధానపార్టీ అభ్యర్థుల నామినేషన్ రోజుల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయపార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పెళ్లకూరు, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల్లో 85 ఏళ్ల నిండిన వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. బుధవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వయోవృద్ధులు, 40శాతానికి మించిన దివ్యాంగులు పూర్తి వివరాలను ఫారం 12 డి ద్వారా వారి బీఎల్వోలకు అందజేయాల్సి ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మీ, ఆర్‌ఐ సంతోషిబాయి, ఎంఈవో ఎం.శంకరయ్య, ఇరిగేషన్ ఏఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ తదితరులు ఉన్నారు.

నామినేషన్లకు సర్వం సిద్ధం: ఆర్వో


ధ్యానచంద్ర

వెంకటగిరి, డక్కిలి, ఏప్రిల్ 17: వెంకటగిరి నియోజకవర్గంలో ఈ నెల 18నుంచి 25వ తేది వరకు నామినేషన్ల ప్రక్రియ జరగనుందని దీనికి సంబంధించి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆర్వో ధ్యానచంద్ర తెలిపారు. నామినేషన్ అఫిడవిట్ సమర్పణలో జాగ్రత్తలపై ప్రజాప్రతినిదులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఆర్వో కార్యాలయంలో రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థి సహా నలుగురికి మాత్రమే ఆర్వో కార్యాలయంలో అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్లు వేసే సమయంలో సీసీ కెమెరాలతోపాటు, వీడియో రికార్డింగ్, టైం వాల్‌క్లాక్ ఉంటుందన్నారు. ఆర్వో కార్యాలయం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఏఆర్వో బృందం నామినేషన్ల అఫిడవిట్‌ను క్షుణ్ణంగా పరిశీలి స్తుందన్నారు. ఏవరి నామినేషన్ తిరస్కరించమన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కోట/ సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని చిట్టేడు రొయ్యల పరిశ్రమలో బుధవారం స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. అగ్నిమాపక అధికారి హరీష్ కార్మికులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సూళ్లూరుపేట పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న కీర్తి ఎన్‌క్లేవ్ వద్ద బుధవారం అగ్నిమాపక సిబ్బంది స్థానికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సి చర్యలను వివరించారు. అనంతరం మాక్‌డ్రిల్ నిర్వహించారు.

సిలికా దోపిడీని అరికట్టమని జగన్‌ను కోరా

తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు


మధుసూదన్‌రెడ్డితో చర్చిస్తున్న వెలగపల్లి వరప్రసాద్‌రావు

చిట్టమూరు/వాకాడు, ఏప్రిల్ 17: చిల్లకూరు మండలంలో సిలికా దోపిడీకి గురవుతోందని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోగా అక్కడే ఉన్న విజయసాయిరెడ్డి కల్పించుకొని సంఘటనా స్థలానికి ఎందుకు వెళ్లావని ప్రశ్నించారని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... విజయసాయిరెడ్డి తనను ప్రశ్నించిన సమయంలో అక్కడే ఉన్న అప్పటి మంత్రి బాలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి కల్పించుకొని నియోజకవర్గంలో సమస్యలను సీఎం దృష్టికి తెచ్చారంటే అర్థం చేసుకోవాలే కానీ ఎదురు ప్రశ్నించడం ఏమిటని అసహనం వ్యక్తం చేసినా సీఎం నోరు విప్పలేదన్నారు. వనరులన్నీ దోపిడీకి గురయ్యాయని, వేలాది కోట్ల రూపాయల ఇసుకను దోపిడీ చేశారని విమ ర్శించారు. ఇటువంటి ప్రభుత్వంలో ఉండలేక అవమానాలు భరించలేక బయటకు వచ్చానని చెప్పారు. అంతకుముందు గునపాటిపాళెం వెళ్లిన వరప్రసాద్ వైసీపీ నాయకుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డిని మ ర్యాదపూర్వకంగా కలుసుకొని బీజేపీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు మింగేశారు...

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, గ్రామాల్లో కనీస వసతులకు డబ్బులు లేని పరిస్థితి దాపురించిందని వరప్రసాదరావు అన్నారు. బుధవారం జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బి. ప్రమీల నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తీరప్రాంత గ్రామాలకు రోడ్డు వసతి, వన్యప్రాణి విభాగం పరిధిలో రోడ్ల నిర్మాణానికి తాను గెలిచిన వెంటనే అనుమతులు కోసం కేంద్రంలో సంప్రదింపులు జరిపి సాధించుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు బీజేపీ నాయకులు పి.పురుషోత్తమరెడ్డి, టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆయన వైసీపీ రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి నందగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పార్టీలోకి ఆహ్వానించారు.